thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

ఎల్లమ్మ' కోసం 100 మంది కళాకారులు!

12

చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 199 | జగిత్యాల శనివారం 31 అక్టోబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

గ్యాస్ కొరతపై తప్పుడు ప్రచారం

- ఎరువులు, వంటగ్యాస్ కొరతపై ప్రతిపక్షాలది దుష్ప్రచారమన్న మోదీ
- రాజకీయ లబ్ధి కోసం ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని విమర్శ
- రైతులపై భారం పడకుండా ఎరువుల ధరల నియంత్రణకు చర్యలు
- 26 కోట్లకు పైగా సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీ

4

చమోలీలో హెలికాప్టర్ కుప్పకూలినట్లు అనుమానం

- ఫాటా నుంచి బద్రీనాథ్ వెళ్తుండగా ప్రమాదం
- ఐదుగురు ప్రయాణికులు, పైలట్ ఉన్నట్లు గుర్తింపు
- శకలాల కోసం కొనసాగుతున్న గాలింపు

4

ఓటు హక్కు పరిరక్షణకు రాంలీలా మైదాన్‌లో ర్యాలీ

- నవంబర్ 1న ఇండియా కూటమి భారీ నిరసన కార్యక్రమం
- 10 లక్షల మంది హాజరవుతారని కాంగ్రెస్ అంచనా
- ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారిని అడ్డుకుంటున్నారని అమిత్ షాపై రాహుల్ ఆరోపణ

4

రూ.50 వేల కోట్ల విలువైన భూములు ప్రభుత్వానివే

- "భూకబ్జాలపై పోరాడినందుకే నన్ను జైలుకు పంపారు"
- సుప్రీం తీర్పుపై రేవంత్‌రెడ్డి హర్షం
- కేసీఆర్, కేటీఆర్‌పై సీఎం తీవ్ర ఆరోపణలు
- మూడేళ్లలో రూ.1.50 లక్షల కోట్ల భూములకు రక్షణ
- భూముల విక్రయ ఆదాయం విద్య, వైద్యం, సాగునీటికే

హైదరాబాద్, అక్టోబర్ 30: మియాపూర్‌లోని రూ.50 వేల కోట్ల విలువైన భూములు ప్రభుత్వానికే చెందుతాయని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విలువైన భూములను కబ్జా చేసేందుకు కుట్రలు జరిగాయని ఆరోపించారు. శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా, ఎంపీగా, పీసీసీ అధ్యక్షుడిగా భూకబ్జాలపై పోరాడినందుకే తనపై కక్షగట్టి జైలుకు పంపారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తరఫున న్యాయస్థానంలో బలమైన వాదనలు వినిపించడం వల్లే అనుకూల తీర్పు వచ్చిందన్నారు. భూముల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు

మిగతా 3వ పేజీలో..

దానం నాగేందర్ మా అభ్యర్థి

- ఎన్నికలేవైనా సీరియస్‌గానే తీసుకుంటా
- కేసీఆర్ పాలనపై సీఎం రేవంత్ ఘాటు వ్యాఖ్యలు
- కాళేశ్వరంపై నిపుణుల సూచనల మేరకే నిర్ణయాలు
- హైదరాబాద్ ట్రాఫిక్‌కు వన్‌వేనే పరిష్కారం: సీఎం రేవంత్ రెడ్డి
- మెట్రో రుణంపై కేంద్రం తీరుపై అసంతృప్తి

2

ప్రపంచస్థాయి నగరంగా హైదరాబాద్

- నగరాభివృద్ధికి రూ.84,790 కోట్లతో సమగ్ర కార్యాచరణ
- మూసీ పునరుజ్జీవం, ఆరఆరఆర్, ఫ్యూచర్ సిటీతో హైదరాబాద్‌కు కొత్త రూపు
- రియల్ ఎస్టేట్ రంగం రాష్ట్ర ప్రగతిలో భాగస్వామి కావాలి
- నారెడ్కో ప్రాపర్టీ షోలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, అక్టోబర్ 30 : హైదరాబాద్ నగరాన్ని ప్రపంచంలోని అభివృద్ధి చెందిన నగరాలకు దీటుగా తీర్చిదిద్దడంతో పాటు తెలంగాణను దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా నిలబెట్టడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నగరాభివృద్ధి, రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల పాత్ర అత్యంత కీలకమని, ఈ రంగంలో ఉన్నవారిని కేవలం వ్యాపారవేత్తలుగా కాక సంపద సృష్టికర్తలుగా ప్రభుత్వం గుర్తిస్తోందన్నారు. హైదరాబాద్ హైటెక్స్‌లో శుక్రవారం నిర్వహించిన నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షోలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. హైదరాబాద్‌కు దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే అనేక అనుకూలతలు ఉన్నాయని, మోస్ట్ లివబుల్ సిటీగా గుర్తింపు పొందిన ఈ నగరంలో స్థిరపడేందుకు వివిధ ప్రాంతాల

మిగతా 3వ పేజీలో..

సింగరేణి కార్మికులకు మరో శుభవార్త

- 5న సింగరేణి దీపావళి బోనస్ చెల్లింపు
- దీపావళి శుభాకాంక్షలతో వెల్లడించిన ఉప ముఖ్యమంత్రి భట్టి
- ఒక్కో కార్మికుడికి గరిష్టంగా రూ.1,10,250 చెల్లింపు
- దాదాపు 38 వేల మంది కార్మికులకు అందనున్న బోనస్

3

విద్యుత్ ఉద్యోగులకు డీఏ, డీఆర్ పెంపు

3

- విద్యుత్తు సంస్థల సీఎండీలను ఆదేశించిన డిప్యూటీ సీఎం భట్టి
- 19.272 నుంచి 21.815 శాతానికి పెంపు.. జూలై 1 నుంచి వర్తింపు
- 71,360 మందికి ప్రయోజనం.. నెలకు రూ.14.63 కోట్ల అదనపు భారం

మియాపూర్ భూమిని కాపాడింది బీఆర్ఎస్ ప్రభుత్వమే

- నాడు కేసీఆర్ దృఢనిశ్చయంతో వ్యవహరించారు
- అన్ని వివరాలు సుప్రీంకోర్టు రికార్డుల్లో స్పష్టంగా వున్నాయి
- సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ ఈకేసు వాదించారు
- ఈ భూములను తెగనమ్మే కుట్రకు తెర లేపారు
- మాజీ మంత్రి హరీష్ రావు

2

ఆహార తయారీ కేంద్రాలపై కొరడా

- హైదరాబాద్, వరంగల్, రంగారెడ్డి జిల్లాల్లో 20 యూనిట్లలో తనిఖీలు
- అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాల తయారీ
- తొమ్మిది సంస్థల ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు సస్పెండ్
- రూ.5.89 లక్షల విలువైన 5,555 కిలోల సరుకులు సీజ్
- కల్తీ అనుమానంతో 21 ఆహార నమూనాలు ల్యాబ్‌కు

2

నిమ్స్‌లో ఏసీబీ సోదాలు పూర్తి

- అర్ధరాత్రి 2 గంటల వరకు కొనసాగిన తనిఖీలు
- డిప్యూటీ సూపరింటెండెంట్ లక్ష్మీభాస్కర్ అరెస్టు నేపథ్యంలో దర్యాప్తు
- బినామీల నివాసాల్లోనూ ఏసీబీ బృందాల సోదాలు
- సెక్యూరిటీ, మెడిసిన్, క్యాంటీన్ టెండర్లలో అక్రమాలపై ఆరా

2

ఒమేగా ఆసుపత్రులపై ఐటీ దాడులు

- దేశవ్యాప్తంగా 24 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు
- తెలంగాణ, ఏపీ సహా ఐదు రాష్ట్రాల్లో సోదాలు
- ఆసుపత్రుల ఆర్థిక లావాదేవీలు, బిల్లింగ్ రికార్డుల పరిశీలన
- పన్ను ఎగవేత ఆరోపణల నేపథ్యంలో పత్రాలు, డిజిటల్ ఆధారాల సేకరణ

2

ఇంద్రవెల్లి పాపం కాంగ్రెస్ దే

- పంట వేయొద్దన్న సీఎం అధికారంలో వుండొద్దు
- జిల్లాలో ఒక్క ఎకరానికీ నీరివ్వని బీఆర్ఎస్
- చనఖా–కొరటా ప్రాజెక్టులో భారీ అవినీతి
- సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపిస్తున్నాం
- రెండు ఎమ్మెల్సీ స్థానాలకు బీసీలనే నిలబెట్టాం
- ఆదిలాబాద్ పాంచజన్య సభలో కవిత

2

చేవెళ్ల ఫామ్‌హౌస్‌లో విద్యార్థుల పార్టీపై పోలీసుల దాడి

- ఎల్లీ ఫామ్‌హౌస్‌లో ఎస్ఓటీ, చేవెళ్ల పోలీసుల ఆకస్మిక తనిఖీలు
- ఐబీఎస్ ఇక్ఫాయ్ యూనివర్సిటీ విద్యార్థులే నిర్వాహకులుగా అనుమానం
- మద్యం, మత్తు పదార్థాల వినియోగంపై పోలీసుల ఆరా

2

చేవెళ్ల ఫామ్‌హౌస్‌లో విద్యార్థుల పార్టీపై పోలీసుల దాడి

చేవెళ్ల, అక్టోబర్ 30:

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధిలోని ఓ ఫామ్‌హౌస్‌లో విద్యార్థులు నిర్వహిస్తున్న పార్టీపై పోలీసులు దాడి చేశారు. కమ్మెట గ్రామ శివారులోని ఎల్జీ ఫామ్‌హౌస్‌లో స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్‌వోటీ), చేవెళ్ల పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టి 40 మందికి పైగా విద్యార్థులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వారిలో 20 నుంచి 25 మంది యువతులు ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. శంకరపల్లి మండలం దొంతన్‌పల్లి పరిధిలోని ఐబీఎస్ ఇక్ఫాయ్ యూనివర్సిటీకి చెందిన బీబీఏ, ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ పార్టీ ఏర్పాటు చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. ఫామ్‌హౌస్‌లో పార్టీ జరుగుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. పోలీసులను గమనించిన కొందరు విద్యార్థులు అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించినప్పటికీ, సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

అనంతరం విద్యార్థులను చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించి వివరాలు సేకరిస్తున్నారు. పార్టీలో మద్యం అక్రమంగా సరఫరా చేశారా? నిషేధిత మత్తు పదార్థాలు వినియోగించారా? అనే అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు. ఫామ్‌హౌస్ యజమాని అనుమతులు, పార్టీ నిర్వహణకు సంబంధించిన వివరాలను కూడా పరిశీలిస్తున్నారు. విచారణ పూర్తయితేనే ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

ఒమేగా ఆసుపత్రులపై ఐటీ దాడులు

హైదరాబాద్, అక్టోబర్30:

ప్రముఖ క్యాన్సర్ చికిత్సా సంస్థ ఒమేగా హాస్పిటల్స్‌పై ఆదాయపు పన్ను శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. దేశవ్యాప్తంగా ఆ సంస్థకు చెందిన 24 ప్రాంతాల్లో ఆసుపత్రుల శాఖలు, యాజమాన్య కార్యాలయాలు, నివాసాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. హైదరాబాద్ ఇన్వెస్టిగేషన్ వింగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయి.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని ఒమేగా ఆసుపత్రుల్లో అధికారులు తనిఖీలు కొనసాగిస్తున్నారు. ప్రధానంగా ఆసుపత్రుల పరిపాలనా విభాగాలు, ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన కార్యాలయాల్లో రికార్డులను పరిశీలిస్తున్నారు. సంస్థకు చెందిన కీలక వైద్యులు, యాజమాన్య ప్రతినిధుల నివాసాల్లోనూ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం.

పన్ను ఎగవేత, అనధికార నగదు లావాదేవీలపై వచ్చిన సమాచారంతో ఈ సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. తనిఖీల్లో భాగంగా పలు పత్రాలు, బ్యాంకు లావాదేవీల వివరాలు, డిజిటల్ హార్డ్ డిస్కులను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆసుపత్రుల ఖాతాల పుస్తకాలు, బిల్లింగ్ సాఫ్ట్‌వేర్‌లోని సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సోదాలు పూర్తయిన తర్వాత ఐటీ శాఖ అధికారికంగా వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

నిమ్స్‌లో ఏసీబీ సోదాలు పూర్తి

హైదరాబాద్:

నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) చేపట్టిన విస్తృత తనిఖీలు ముగిశాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్‌ను ఇప్పటికే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన అధికారులు, ఆమె వ్యవహారాలపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా సుమారు 20 మంది సభ్యులతో కూడిన ఏసీబీ బృందాలు ఆసుపత్రిలో అర్ధరాత్రి 2 గంటల వరకు సోదాలు నిర్వహించాయి.

తనిఖీల సందర్భంగా నిమ్స్‌లోని వివిధ విభాగాలకు సంబంధించిన రికార్డులను అధికారులు పరిశీలించారు. లక్ష్మీభాస్కర్‌కు బినామీలుగా అనుమానిస్తున్న వ్యక్తుల నివాసాల్లోనూ ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఆమె డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పని చేసిన సమయంలో జరిగినట్లు భావిస్తున్న ఆర్థిక అక్రమాలపై ఆధారాలు సేకరించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఆసుపత్రిలో గతంలో కేటాయించిన పలు కాంట్రాక్టుల్లో లక్ష్మీభాస్కర్ పాత్రపై ఏసీబీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. సెక్యూరిటీ నిర్వహణ, మందుల పంపిణీ, మెడికల్ షాప్, క్యాంటీన్, సర్జికల్ విభాగానికి సంబంధించిన కాంట్రాక్టుల కేటాయింపుల్లో అక్రమాలు జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారాలకు సంబంధించిన పత్రాలు, ఇతర ఆధారాలను పరిశీలించిన అనంతరం సోదాలను ముగించారు. □□□□లో వెల్లడయ్యే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.



దానం నాగేందర్ మా అభ్యర్థి

హైదరాబాద్, అక్టోబర్ 30:

ఖైరతాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా దానం నాగేందర్ బరిలో ఉంటారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికలు చిన్నవైనా, పెద్దవైనా తాను అత్యంత సీరియస్‌గా తీసుకుంటానని అన్నారు. ఎన్నికలను తేలిగ్గా తీసుకుని ఉంటే ఈ స్థాయికి వచ్చేవాడిని కాదని వ్యాఖ్యానించారు. తెలంగాణలో బీఆర్‌ఎస్‌ను మళ్లీ అధికారంలోకి రానివ్వబోమని ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన రాజకీయాలు, రాష్ట్ర అభివృద్ధి, కాళేశ్వరం ప్రాజెక్టు, హైదరాబాద్ ట్రాఫిక్, మెట్రో విస్తరణ తదితర అంశాలపై మాట్లాడారు.

కేసీఆర్ పాలనపై విమర్శలు

తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్రాన్ని దోచుకున్నారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి విమర్శలు చేశారు. ఆయన పాలనలో ఎంతో మంది పిల్లల జీవితాలు బలయ్యాయని ఆరోపించారు. ఆ పాపం కేసీఆర్‌ను వెంటాడుతుందని వ్యాఖ్యానించారు. గత పాలనలో జరిగిన అరాచకాలకు ప్రకృతి శిక్ష విధిస్తోందని, కేసీఆర్ రెండోసారి ఓడిపోవడంలోనూ ప్రకృతి తన పని తాను చేస్తుందని అన్నారు. ఇవి రాజకీయ విమర్శలేనని పేర్కొన్నారు.

మెట్రో రుణంపై కేంద్రం తీరుపై అసంతృప్తి

మెట్రో ఫేజ్-1ను రాష్ట్ర ప్రభుత్వం స్వీకరించే విషయంలో కేంద్రం సూచనల మేరకే ముందుకు వెళ్లామని సీఎం తెలిపారు. ఈ అంశంపై ఎల్‌అండ్‌టీతో ఒప్పందం చేసుకున్నామని, రుణం కోసం ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) నుంచి అనుమతి కూడా వచ్చిందని చెప్పారు. అయినప్పటికీ ప్రస్తుతం రుణం మంజూరును అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తాము ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసిన వెంటనే కేటీఆర్ కూడా వచ్చి వారిని కలుస్తారని వ్యాఖ్యానించారు. మెట్రో విస్తరణ, రుణాల మంజూరు విషయంలో కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం జరుపుతున్న చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

కాళేశ్వరంపై నిపుణులదే తుది మాట

కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో కేటీఆర్, హరీశ్‌రావు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని సీఎం విమర్శించారు. ప్రాజెక్టుపై జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) విశ్లేషణ కొనసాగుతోందని తెలిపారు. ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టుల విషయంలో నిపుణుల సూచనల మేరకే తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిర్మాణ దశలో ఉన్న ప్రాజెక్టులకు, నిర్మాణం పూర్తయి వినియోగంలోకి వచ్చిన తర్వాత వర్తించే పరిధులకు మధ్య తేడా ఉంటుందని వివరించారు. కాళేశ్వరం విషయంలో నిపుణుల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు.

పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి

రాష్ట్రంలో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరించిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఏదైనా సమస్య తనకు పూర్తిగా అర్థమైతే దాని పరిష్కారానికి కచ్చితంగా కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ అనుబంధ సంస్థల నాయకులకు సైతం కీలక పదవులు కల్పించామని చెప్పారు. తాను ఎవరికో అనుకూలంగా పనిచేసే వ్యక్తిని కాదని, తనదైన విధానంలో వ్యవహరిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తనను తాను ప్లెయిన్ పేపర్‌తో పోల్చుకున్నారు. ఆర్థిక పరిస్థితిపై మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచే తమ కుటుంబం ఆర్థికంగా బాగుందని, తాను కేసీఆర్ కంటే శ్రీమంతుడినని వ్యాఖ్యానించారు.

అసెంబ్లీకి ఎందుకు రావడం లేదు?

అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ నేతలు హాజరుకాకపోవడంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. కీలక అంశాలపై చర్చించాల్సిన సమయంలో గందరగోళం సృష్టించి బయటకు వెళ్తున్నారని విమర్శించారు. రాజకీయాలను, అభివృద్ధిని తాను ఎప్పుడూ కలిపి చూడనని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులను రాజకీయాలకు అతీతంగా ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేకపోయిన పనులను తమ ప్రభుత్వం చేపడుతుంటే వాటిని అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

కేబీఆర్ పార్కు వద్ద ట్రాఫిక్‌కు వన్‌వే

హైదరాబాద్‌లో కేబీఆర్ పార్కు పరిసరాల్లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఫ్లైఓవర్ల నిర్మాణం చేపట్టాలనే ఉద్దేశంతో వన్‌వే విధానం అమలు చేశామని రేవంత్‌రెడ్డి తెలిపారు. అయితే చివరకు ట్రాఫిక్ సమస్యకు వన్‌వే విధానమే పరిష్కారంగా మారిందని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వివరించారు.

ఇంద్రవెల్లి పాపం కాంగ్రెస్ దే

ఆదిలాబాద్, అక్టోబర్ 30:

తెలంగాణ రక్షణ సేన పార్టీకి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు, ఆదివాసీల దీవెనలు ఉండాలని.. మీ ఆశీర్వాదం కోసమే ఈ జిల్లాకు వచ్చామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. ఉమ్మడి జిల్లాల్లో పాంచజన్య సంకల్ప సభల నిర్వహణలో భాగంగా శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి వద్ద నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా ఇంద్రవెల్లి ఘటనను గుర్తుచేసుకుంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంద్రవెల్లి పాపం కాంగ్రెస్ పార్టీదేనని విమర్శించారు. పంటలు కాపాడుకునేందుకు మీటింగ్ పెట్టుకోవాలనుకున్న ఆదివాసీలను కనికరం లేకుండా పిట్టలను కాల్చినట్లు కాల్చి చంపింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు.తెలంగాణ సాధించుకోని 12 ఏళ్లు అవుతున్న సరే ఆదిలాబాద్ జిల్లాలో అభివృద్ధి లేదని, 750 ఊళ్లలో కనీసం స్కూల్స్ లేని పరిస్థితి ఉందన్నారు. తలసరి ఆదాయంలో ఆదిలాబాద్ జిల్లా చాలా వెనుకబడి ఉందని, ఈ ప్రాంతంలో రోడ్లు, ప్రాజెక్ట్ లు, అభివృద్ధిని అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ పార్టీలు నిర్లక్ష్యం చేశాయన్నారు. 12 ఏళ్లుగా తుమ్మిడి హెట్టి ప్రాజెక్ట్ పేరుతో ఇక్కడి ప్రజలను బీఆర్ఎస్, కాంగ్రెస్ లు మురిపించాయే తప్ప చేసేందేమీ లేదన్నారు. కాగజ్ నగర్ లో కాగజ్ నగర్ లో లక్షా 5 వేల ఎకరాలకు నీళ్లు రావాల్సి ఉంటే 6 వేల ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇచ్చారని ధ్వజమెత్తారు. ఏళ్లకు ఏళ్లుగా ప్రాజెక్ట్ లను పెండింగ్ పెట్టారన్నారు. తుమ్మిడి హెట్టిని పూర్తి చేసి ఉంటే రెండున్నర లక్షల ఎకరాలకు నీళ్లు వచ్చేవని చెప్పారు. చరిత్రలో రైతులను పంటలు వేయవద్దని చెప్పిన మొదటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డేనని కవిత అన్నారు. వ్యవసాయం మాత్రమే తెలిసిన రైతులను పంటలు వేయవద్దంటున్న ముఖ్యమంత్రి వారికి ఏ విధంగా న్యాయం చేస్తారో చెప్పాలని నిలదీశారు. ఇంద్రవెల్లి వీరులకు రూ. 25 లక్షలు ఇస్తామన్న రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక రూ.5 లక్షలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని ధ్వజమెత్తారు. ఇంద్రవెల్లి వీరులను కూడా మోసం చేసిన ఘనత కాంగ్రెస్ దేనని మండిపడ్డారు. ఆదిలాబాద్ జిల్లాకు రేవంత్ రెడ్డి ఇచ్చిన ఒక్క మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు.

ఆదిలాబాద్ లో బీఆర్ఎస్ గర్జన సభ నిర్వహిస్తామని చెబుతోందని, కానీ వారిది గర్జన కాదు, తర్జన భర్జన అని కవిత ఎద్దేవా చేశారు. పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్..పత్తి ఎక్కువగా పండే ఆదిలాబాద్ లో టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటు చేయకపోవటానికి కారణం ఏంటన్నారు. చనఖా కొరటా ప్రాజెక్ట్ లో భారీ ఎత్తున అవినీతికి పాల్పడ్డారని.. రూ. 368 కోట్ల ప్రాజెక్ట్ కాస్ట్ ను ఏకంగా 2100 కోట్లకు పెంచారని చెప్పారు. సామాజిక తెలంగాణ సాధించటమే టీఆర్ఎస్ లక్ష్యమని..ఆ లక్ష్యం దిశగా మాటల్లో కాకుండా చేతల్లో చూపిస్తున్నామని కవిత చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రెండు స్థానాలను తమ పార్టీ బీసీలకే ఇచ్చిందన్నారు. ఆదిలాబాద్ లోని ఇంద్రవెల్లి వద్ద నిర్వహించిన టీఆర్ఎస్ పాంచజన్య సంకల్ప సభ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. ఈ సభకు పెద్ద ఎత్తున ఆదివాసీలు, జిల్లా ప్రజలు తరలివచ్చారు. తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆదిలాబాద్ జిల్లాకు చేరుకోగానే ముందుగా ముత్నూర్ లో కొమురం భీమ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంద్రవెల్లిలోని అమరుల స్థూపం వద్ద నివాళులర్పించి ప్రత్యేక బస్సులో సభ ప్రాంగణానికి అభిమానుల కేరింతలు, నృత్యాలు, డప్పుల కొలహలం మధ్య ర్యాలీగా తరలి వెళ్లారు. దారి పొడువునా ఆదివాసీలు కవితకు స్వాగతం పలికారు.

మియాపూర్ భూమిని కాపాడింది బీఆర్ఎస్ ప్రభుత్వమే

హైదరాబాద్ అక్టోబర్30:

బీఆర్ఎస్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పోరాడి కాపాడిన విలువైన ప్రభుత్వ భూమిని.. ఈ రోజు తాము అమ్ముకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగా ప్రకటించడం సిగ్గుచేటని బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. మియాపూర్ 550 ఎకరాల వివాదంపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తర్వాత, ముఖ్యమంత్రి మీడియా సమావేశం పెట్టి చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని సుప్రీంకోర్టు రికార్డులే స్పష్టం చేస్తున్నాయి. మియాపూర్ భూ వివాదం 2003లోనే ఎస్ఎల్పీ గా సుప్రీంకోర్టుకు చేరింది. 2013లో అది సివిల్ అప్పీల్‌గా మారింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ఈ విలువైన భూమి ప్రభుత్వం చేజారిపోకూడదని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృఢ నిశ్చయంతో వ్యవహరించారు. 2015లోనే దేశంలోనే అత్యుత్తమ న్యాయవాదుల్లో ఒకరైన సీనియర్ న్యాయవాది సీ.ఎస్. వైద్యనాథన్ను ప్రత్యేకంగా నియమించారు. ఈ వివరాలన్నీ సుప్రీంకోర్టు రికార్డుల్లో స్పష్టంగా నమోదై ఉన్నాయి. ప్రజలందరికీ అందుబాటులోనూ ఉన్నాయి. సీనియర్ న్యాయవాది సీ.ఎస్. వైద్యనాథన్ 2015 ఏప్రిల్ 7 నుంచి తెలంగాణ ప్రభుత్వం తరపున మియాపూర్ భూముల రక్షణ కోసం సుప్రీంకోర్టులో వాదిస్తూ వచ్చారు. 2015 నుంచి 2023 వరకు దాదాపు 8 ఏళ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ భూముల పరిరక్షణ కోసం అలుపెరగని న్యాయపోరాటం చేసింది. మియాపూర్ భూమికి సంబంధించిన ప్రతి పిటిషన్, ప్రతి అఫిడవిట్, సమగ్ర ఆధారాలను సుప్రీంకోర్టు ముందు ఉంచింది నాటి బీఆర్ఎస్ ప్రభుత్వమే. గౌరవ సుప్రీంకోర్టు మియాపూర్ భూముల తీర్పులో మియాపూర్ తీర్పుకు అసలు పునాది 'ట్రినిటీ ఇన్‌ఫ్రావెంచర్స్' కేసు తీర్పేనని స్పష్టంచేసింది. గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌కు సంబంధించిన ఆ కేసు 2023 జూన్ 15న తెలంగాణ ప్రభుత్వం విజయం సాధించింది. ఆనాడు రాష్ట్రంలో అధికారంలో ఉన్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే. ఆ కేసులోనూ ప్రభుత్వం తరపున వాదించింది అదే వైద్యనాథన్. నాడు మేము సాధించిన ఆ విజయమే, ఆ తీర్పులోని చట్టపరమైన అంశాలే నేడు మియాపూర్ భూముల తుది తీర్పుకు బలమైన ఆధారమయ్యాయి. ఈ రికార్డులన్నీ సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో బహిరంగంగా ఉన్నప్పటికీ, తానే ఏదో సాధించినట్లు ముఖ్యమంత్రి ప్రెస్ మీట్లు పెట్టి సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదం, సిగ్గుచేటు.

ప్రెస్ మీట్ పెట్టి అబద్ధాలు ప్రచారం చేసినంత మాత్రాన అవి నిజాలు అయిపోవు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన నిరంతర పోరాటం వల్లే నేడు మియాపూర్ భూములు పరిరక్షించబడ్డాయని స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశం వెనుక ఉన్న అసలు కుట్ర వేరే ఉంది. మియాపూర్‌లో ఉన్న ఈ 550 ఎకరాల భూమి విలువ రూ. 60 వేల కోట్ల పైమాటేనని స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించారు. ఈ విలువైన భూములను అమ్ము

కోవడానికే ఇప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు.విలువైన జాతి సంపదను ప్రజల భవిష్యత్తు అవసరాలకు ఉపయోగించకుండా తెగనమ్ముకునే కుట్రకు తెరలేపారని ఆరోపించారు.

ఆహార తయారీ కేంద్రాలపై కొరడా

హైదరాబాద్:

ప్రజారోగ్యానికి ముప్పుగా పరిణమిస్తున్న ఆహార తయారీ కేంద్రాలపై తెలంగాణ ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (TG SAFE) చర్యలు ముమ్మరం చేసింది. ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసులతో కూడిన 10 ప్రత్యేక బృందాలు హైదరాబాద్, వరంగల్, ఉమ్మడి వరంగల్, రంగారెడ్డి జిల్లాల్లో సుమారు 20 తయారీ యూనిట్లపై ఒకేసారి దాడులు నిర్వహించాయి. మసాలాలు, వంట నూనెలు, పాల ఉత్పత్తులు, స్వీట్లు, శీతల పానీయాలు, బేకరీ పదార్థాల తయారీ కేంద్రాల్లో తనిఖీలు చేపట్టగా అనేక ఉల్లంఘనలు బయటపడ్డాయి.

తయారీ కేంద్రాల్లో కనీస పరిశుభ్రత ప్రమాణాలు కూడా పాటించడం లేదని అధికారులు గుర్తించారు. తుప్పు పట్టిన యంత్రాలు, మురికి పాత్రలతో ఆహార పదార్థాలను తయారు చేస్తున్నట్లు తేలింది. కాలం చెల్లిన, సరైన లేబులింగ్ లేని వస్తువులను నిల్వ ఉంచినట్లు గుర్తించారు. బొద్దింకలు, ఈగలు, దోమలు, ఎలుకల వ్యర్థాలు, పురుగులు ఉన్న ప్రాంతాల్లోనే ఉత్పత్తుల తయారీ సాగుతున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. మురుగునీరు నిలిచిన నేలలు, బూజు పట్టిన గోడలు, గాలి, వెలుతురు సరిగా లేని గదుల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు.

సిబ్బంది ఆరోగ్య వివరాలు, పెస్ట్ కంట్రోల్ నివేదికలు, నీటి నాణ్యత పరీక్షలకు సంబంధించిన రికార్డులు కూడా అందుబాటులో లేవని అధికారులు గుర్తించారు. కార్మికులు హెయిర్ నెట్స్, ఆప్రాన్లు, గ్లౌజులు ధరించకుండా విధులు నిర్వహిస్తున్నట్లు తేలింది. ఈ లోపాలను తీవ్రంగా పరిగణించిన అధికారులు తొమ్మిది సంస్థల ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులను సస్పెండ్ చేసి, ఉత్పత్తి, విక్రయ కార్యకలాపాలను నిలిపివేయాలని ఆదేశించారు.

లైసెన్సులు సస్పెండైన సంస్థల్లో వరంగల్‌కు చెందిన హరిప్రియ ప్రొడక్ట్స్, దయానంద్ ఐస్‌క్రీమ్స్, రాజు ఘీ స్వీట్ హౌస్, శ్రీకృష్ణ ఆయిల్ మిల్స్, మట్టెవాడ రమేష్ ఇండస్ట్రీస్, జియాన్ ఫుడ్ ప్రొడక్ట్స్ (వెల్ మార్క్), గొర్రెకుంట కృపా బేకరీ ప్రొడక్ట్స్, హనుమకొండకు చెందిన కపిల్ ఫుడ్స్, షాద్‌నగర్ చాతన్‌పల్లిలోని శ్రీ ఎస్‌ఎంపీ డెయిరీ ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన రూ.5,89,550 విలువైన 5,555 కిలోల ఆహార పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. కల్తీ జరిగిందనే అనుమానంతో 21 నమూనాలను సేకరించి ప్రయోగశాలలకు పంపించారు. మరో తొమ్మిది సంస్థలైన గంగా ఫుడ్ టెక్, జీపీఆర్ ఫుడ్స్, హెల్తీ హార్ట్ ఫుడ్స్, వర్షా స్పైసెస్, కరణి స్పైసెస్, మిఠాయివాలా, బెల్ బ్రాండ్, స్వాగత్ స్వీట్స్, మార్లూస్ ఫుడ్ అండ్ బెవరేజెస్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇక లక్ష్మి ఫుడ్స్ (తిమ్మాపూర్), శివ తార ఫ్లోర్ మిల్ (వరంగల్)

లో గుర్తించిన లోపాలను సరిచేసుకోవాలని ఆదేశిస్తూ ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు ఇచ్చారు. నిబంధనలు పాటించని సంస్థలపై తదుపరి చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు.

చురకలు

శనివారం 31.10.2026

ప్రపంచస్థాయి నగరంగా హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి

ప్రజలు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వాలు కల్పించిన మౌలిక సదుపాయాలను మరింత విస్తరిస్తూ ప్రస్తుత ప్రభుత్వం నగరాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు.

రూ.84,790 కోట్లతో నగరాభివృద్ధికి బృహత్తర ప్రణాళిక

హైదరాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం సుమారు రూ.84,790 కోట్లతో భారీ కార్యాచరణను రూపొందించిందని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇందులో ఇప్పటికే సుమారు రూ.55 వేల కోట్ల పనులకు సంబంధించి డిజైన్లు, టెండర్ల ప్రక్రియ చేపట్టడంతోపాటు పలు పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. రానున్న రోజుల్లో నగరంలోని ప్రతి ప్రాంతంలో అభివృద్ధి పనులు, నిర్మాణ కార్యక్రమాలు కనిపిస్తాయని చెప్పారు. హెచ్ఎండీఏ, హైదరాబాద్ గ్రోత్ కారిడార్, మెట్రో రైలు తదితర మౌలిక సదుపాయాల కోసం రూ.52,706 కోట్లు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డుకు రూ.15,849 కోట్లు కేటాయించి పనులు ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో రూ.4 వేల కోట్లు, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.2,500 కోట్లు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.2,163 కోట్లు, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రహదారుల అభివృద్ధికి రూ.500 కోట్లతో పనులు చేపడుతున్నట్లు వివరించారు.

మూసీ పునరుజ్జీవంతో నగరానికి కొత్త ఆభరణం మూసీ నదిని మురికి కూపం నుంచి స్వచ్ఛమైన జలాలతో ప్రవహించే నదిగా మార్చి హైదరాబాద్‌కు గొప్ప ఆస్తిగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పమని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన నగరాలు తమ మధ్యలో ప్రవహించే నదులను శుద్ధి చేసి పర్యాటక, ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేసుకున్నాయని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో మూసీ పునరుజ్జీవన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. తొలి దశలో సుమారు రూ.7,500 కోట్ల పనులను ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని చెప్పారు. మూసీలోకి మురుగు నీరు చేరకుండా నగరంలోని 21 ప్రధాన నాలాల వద్ద ఒకేసారి మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చి టెండర్ల ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఎస్టీపీల సంఖ్యను 38కు పెంచే ఆలోచన ఉందన్నారు. శుద్ధి చేసిన నీటిని పారిశ్రామిక అవసరాలు, ఉద్యానవనాల నిర్వహణకు వినియోగించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని వెల్లడించారు. మూసీ నది భవిష్యత్తులో హైదరాబాద్‌కు అతిపెద్ద ఆభరణంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.

భారత్ ఫ్యూచర్ సిటీతో అభివృద్ధికి నూతన దిశ

సుమారు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని భట్టి తెలిపారు. ఇందులో 15 వేల ఎకరాలను పచ్చదనం, విశాలమైన బహిరంగ ప్రదేశాల కోసం కేటాయించడం విశేషమన్నారు. మొత్తం భూభాగంలో 50 శాతం గ్రీన్ స్పేస్‌గా ఉంచుతూ నగర నిర్మాణం చేపట్టడం దేశంలోనే ప్రత్యేకతగా నిలుస్తుందని చెప్పారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు తోడుగా భారత్ ఫ్యూచర్ సిటీ మరో కీలక అభివృద్ధి కేంద్రంగా రూపుదిద్దుకోనుందని పేర్కొన్నారు. నగరాభివృద్ధికి అవసరమైన నీటి వనరుల విషయంలోనూ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, కృష్ణా, గోదావరి జలాలను నగరానికి తీసుకొచ్చే ప్రణాళికలు హైదరాబాద్ విస్తరణకు దోహదపడ్డాయని గుర్తుచేశారు.

కాలుష్య నియంత్రణకు హిల్ట్ పాలసీ

హైదరాబాద్‌ను స్వచ్ఛమైన, పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు హిల్ట్ పాలసీని తీసుకొచ్చినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఓఆరఆర్ పరిధిలోని పరిశ్రమలను దశలవారీగా బయటకు తరలించడం ద్వారా నగరంలో కాలుష్యాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ప్రజా రవాణాలో డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టడంతోపాటు ఆటోలను కూడా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు సబ్సిడీతో కూడిన సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, ఆధునిక రవాణా వ్యవస్థల సమన్వయంతో హైదరాబాద్‌ను మరింత నివాసయోగ్యమైన నగరంగా అభివృద్ధి చేస్తామన్నారు.

రోడ్ల అభివృద్ధికి రూ.93 వేల కోట్లు

హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో రవాణా సదుపాయాలను మెరుగుపరిచేందుకు సుమారు రూ.93 వేల కోట్లతో రహదారుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. నాలుగు వరుసల రహదారులు, ఫ్లైఓవర్లు, ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. నగరాభివృద్ధితో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

నిర్మాణ రంగానికి అవసరమైన నైపుణ్య మానవ వనరులు

రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనతో ఫ్యూచర్ సిటీలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి తరగతులు కూడా ప్రారంభించినట్లు వెల్లడించారు. శిక్షణ పూర్తిచేసిన యువతకు పరిశ్రమల్లోనే ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా వినూత్న విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. ?రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 65 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నామని, ఆధునిక యంత్రాలు, నిర్మాణ రంగ సాంకేతికతలపై యువతకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, ప్రతిభ కలిగిన యువతను ప్రభుత్వమే శిక్షణ ఇచ్చి అందించేందుకు సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. నగరంలో లగ్జరీ గృహాలతోపాటు పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో ఇళ్లు నిర్మించే అంశంపై కూడా దృష్టి సారించాలని పరిశ్రమ వర్గాలకు సూచించారు. గతంలో హౌసింగ్ బోర్డు ద్వారా నిర్మించిన ఎంఐజీ, ఎల్ఐజీ గృహాలు అనేక కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చాయని గుర్తు చేశారు. అదే తరహాలో దీర్ఘకాలిక ప్రణాళికతో అందుబాటు గృహ నిర్మాణానికి ముందుకు రావాలని కోరారు. తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగ ప్రతినిధులు భాగస్వాములై సంపద సృష్టికర్తలుగా ముందుకు రావాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

విద్యుత్ ఉద్యోగులకు డీఏ, డీఆర్ పెంపు

- **విద్యుత్తు సంస్థల సీఎండీలను ఆదేశించిన డిప్యూటీ సీఎం భట్టి**
- **19.272 నుంచి 21.815 శాతానికి పెంపు.. జూలై 1 నుంచి వర్తింపు**
- **71,360 మందికి ప్రయోజనం.. నెలకు రూ.14.63 కోట్ల అదనపు భారం**

హైదరాబాద్, అక్టోబర్ 30 :

రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త అందించింది. వారికి చెల్లించే కరువు భత్యం(డీఏ), కరువు ఉపశమనం(డీఆర్) పెంపునకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యుత్ సంస్థల సీఎండీలను ఆదేశించారు. ప్రస్తుతం 19.272 శాతంగా ఉన్న డీఏ, డీఆర్‌ను 2.543 శాతం పాయింట్లు పెంచి 21.815 శాతానికి సవరించనున్నారు. ఈ పెంపు 2026 జూలై 1వ తేదీ నుంచి వర్తించనుంది. కార్మిక శాఖ పరిధిలోని లేబర్ బ్యూరో ప్రకటించే అఖిల భారత ధరల సూచీ ఆధారంగా డీఏ, డీఆర్‌ను సవరిస్తారు. ధరల సూచీలో వచ్చే మార్పులకు అనుగుణంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి జనవరి, జూలై నెలల్లో ఈ సవరణ చేపడుతున్నారు. తాజాగా చేపట్టిన ప్రతిపాదిత పెంపునకు ఆమోదం లభించి అమల్లోకి వస్తే రాష్ట్రంలోని నాలుగు విద్యుత్ సంస్థల పరిధిలో 71,360 మంది ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు ప్రయోజనం చేకూరనుంది. ఇందుకోసం విద్యుత్ సంస్థలపై నెలకు సుమారు రూ.14.63 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనుంది.

మ్యాప్‌లుచూడండి

సంస్థల వారీగా లబ్ధిదారులు ఇలా

టీజీ ట్రాన్స్‌కో పరిధిలో 3,081మంది ఉద్యోగులు, 3,644మంది ఆర్టిజన్లు, 2,469 మంది పెన్షనర్లు కలిపి మొత్తం 9,194 మందికి ప్రయోజనం కలగనుంది. టీజీ జెన్‌కోలో 7,197 మంది ఉద్యోగులు, 3,544 మంది ఆర్టిజన్లు, 3,426 మంది పెన్షనర్లు కలిపి 14,167 మంది లబ్ధి పొందనున్నారు. టీజీ ఎస్పీడీసీఎల్‌లో 11,719 మంది ఉద్యోగులు, 8,493 మంది ఆర్టిజన్లు, 8,269 మంది పెన్షనర్లు కలిపి 28,481 మందికి, టీజీ ఎన్పీడీసీఎల్‌లో 9,936 మంది ఉద్యోగులు, 3,435 మంది ఆర్టిజన్లు, 6,147 మంది పెన్షనర్లు కలిపి 19,518 మందికి ప్రయోజనం చేకూరనుంది.ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, విద్యుత్ సంస్థల సిబ్బంది ప్రయోజనాలను పరిరక్షించడంలో భాగంగానే ఈ డీఏ, డీఆర్ పెంచాలని ఆదేశాలు ఇచ్చినట్టు డిప్యూటీ సీఎం తెలిపారు.

సింగరేణి కార్మికులకు మరో శుభవార్త

సింగరేణి భవన్, అక్టోబరు 30 :

ఇటీవలే లాభాల వాటా బోనస్ (దసరా బోనస్)ను అందుకున్న సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం మరో తీపి కబురు చెప్పింది. నవంబర్ 5వ తేదీన దీపావళి బోనస్ ను చెల్లించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో సింగరేణి ఉద్యోగులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్ బోనస్ (దీపావళి బోనస్)ను నవంబర్ 5వ తేదీన చెల్లించాల్సిందిగా సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. బోనస్‌గా రూ.419 కోట్లను చెల్లించనున్నట్లు, ఒక్కో కార్మికుడికి గరిష్ఠంగా రూ.1,10,250 చొప్పున దీపావళి బోనస్ చెల్లించనున్నట్లు వివరించారు. రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న సింగరేణి సంస్థ అభివృద్ధి విస్తరణకు ప్రజా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. లాభాల వాటా కింద ఈ నెలలో దాదాపు రూ.600 కోట్లT చెల్లించగా తాజాగా రూ.419 కోట్ల దీపావళి బోనస్ చెల్లించబోతున్నట్లు తెలిపారు. బొగ్గు రంగంలో పోటీని అధిగమించేందుకు బొగ్గు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే ప్రయత్నం చేయాలన్నారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలపై సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి సంబంధిత పర్సనల్, ఫైనాన్సు అధికారులతో మాట్లాడి నవంబర్ 5న దీపావళి బోనస్‌ను కార్మికుల బ్యాంకు ఖాతాల్లో చెల్లింపునకు తగిన ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఎన్‌సీడబ్ల్యుఏ ఉద్యోగులకు వర్తింపు

దీపావళి బోనస్ కింద సగటున ఒక్కొక్క కార్మికుడికి ఈ సారి రూ.1,10,250లు అందనున్నాయి. ఈ బోనస్ కేవలం ఎన్‌సీడబ్ల్యూఎ ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుంది. ఇది అధికారులకు వర్తించదు. గత ఆర్థిక సంవత్సరంలో భూగర్భ గనుల విభాగంలో 190 పని దినాలు, ఓపెన్ కాస్ట్, సర్ఫేస్ విభాగాల్లో 240 పని దినాలు పూర్తి చేసిన కార్మికులకు పూర్తిస్థాయిలో బోనస్ అందుతుంది. అంతకంటే తక్కువ పని దినాల హాజరు కలవారికి వారు పని చేసిన కాలానికి నిష్పత్తి ప్రకారం బోనస్‌ను లెక్క కట్టి చెల్లించనున్నారు. అయితే ఈ బోనస్ పొందడానికి కనీస అర్హతగా గత ఆర్థిక సంవత్సరంలో ఏ కార్మికుడైనా కనీసం 30 రోజులు పని చేసి ఉండాలని నిర్ణయించారు. మొత్తం మీద సుమారు 38,000మంది ఉద్యోగులకు ఈ బోనస్ వర్తించనుంది.నెల రోజుల వ్యవధిలోనే దసరా, దీపావళి బోనస్‌ల రూపంలో సగటున దాదాపు రూ.2,65,000ను కార్మికులు అందుకోబోతున్నారు. సింగరేణి యాజమాన్యం ఈ రెండు బోనస్ లతో కలిపి ఒక్కో కార్మికుడికి సుమారు రూ.1,020 కోట్లను చెల్లించింది. ఈ నేపథ్యంలో సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి సింగరేణి ఉద్యోగులకు తన దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ కార్మికులు బోనస్‌ల సొమ్మును తమ కుటుంబ అవసరాలకు వినియోగించుకోవాలని, అవకాశం ఉంటే పొదుపు చేసుకోవాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ పండుగల స్ఫూర్తితో ఉత్సాహంగా పనిచేయాలని గనుల వారీగా, శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని కోరారు.

గ్లోబల్ ఐటీ & ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్

- **పోచారంలో రూ.600 కోట్లతో ఇన్ఫోసిస్ నూతన డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం**

హైదరాబాద్, అక్టోబర్ 30 :

పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం కల్పించడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి ప్రతిష్ఠాత్మక కేంద్రంగా తీర్చిదిద్దడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ సమీపంలోని పోచారం ఇన్ఫోసిస్ ప్రాంగణంలో రూ.600 కోట్ల వ్యయంతో 11 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన నూతన సాఫ్ట్‌వేర్ అభివృద్ధి భవనాన్ని (10,000 సీట్ల సామర్థ్యం) శుక్రవారం వారు కలసి ప్రారంభించారు.

హైదరాబాద్‌పై అంతర్జాతీయ సంస్థల విశ్వాసం: డిప్యూటీ సీఎం భట్టి

నగరంలో ఇప్పటికే 48 వేల మందికి పైగా ఉద్యోగులతో సేవలు అందిస్తున్న ఇన్ఫోసిస్, మరో 10 లక్షల చదరపు అడుగులకు పైగా విస్తీర్ణంలో కొత్త కార్యాలయాన్ని అందుబాటులోకి తేవడం హైదరాబాద్‌పై ఆ సంస్థకున్న నమ్మకానికి ప్రతీక అని భట్టి విక్రమార్క తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత విస్తరిస్తున్న తరుణంలో యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణ, ప్రాక్టికల్ అనుభవం అందించాలన్నారు. పరిశ్రమలువిద్యాసంస్థల మధ్య అనుసంధానం పెంచి, జిల్లాల్లోని కళాశాలల్లో చదివే విద్యార్థులకు కూడా ఐటీ రంగంలో సమాన అవకాశాలు కల్పించాలని ఇన్ఫోసిస్ యాజమాన్యాన్ని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వేగవంతమైన పరిపాలన, నాణ్యమైన మౌలిక సదుపాయాలు, నిరంతర విద్యుత్ సరఫరా మరియు పర్యావరణహిత అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు.

ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యం: మంత్రి శ్రీధర్ బాబు

పోచారంలో 450 ఎకరాల్లో విస్తరించిన ఇన్ఫోసిస్ ప్రాంగణ అభివృద్ధికి ఇప్పటివరకు రూ.3,200 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టారని, కొత్త సెంటర్ రాకతో గ్లోబల్ ఐటీ రంగంలో హైదరాబాద్ స్థానం మరింత బలపడుతుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఇంజినీరింగ్ సేవలు భవిష్యత్తు ఐటీ వృద్ధికి కీలకంగా మారతాయని వెల్లడించారు. కొత్త భవనంలో రేడియంట్ కూలింగ్ వ్యవస్థ, స్మార్ట్ లైటింగ్, వర్షపు నీటి సంరక్షణ, మురుగునీటి పునర్వినియోగం మరియు సహజ కాంతి వినియోగం వంటి పర్యావరణహిత వసతులు కల్పించడాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, ఇన్ఫోసిస్ సీఎఫ్ఓ జయేశ్ సంఘరాజ్కా, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్లు సునీల్ కుమార్ ధారేశ్వర్, రాజనీష్ మాల్వియా, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నిలాద్రి ప్రసాద్ మిశ్రా, డెవలప్‌మెంట్ సెంటర్ హెడ్ ప్రణబ్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేల కోట్ల విలువైన భూములు ప్రభుత్వానివే

మొదటిపేజీ తరువాయి

తెలిపారు.

కేసీఆర్, ఆయన బంధువు దామోదర్‌రావు, గోల్డ్‌స్టోన్ ప్రసాద్ కలిసి మియాపూర్ భూములను కొల్లగొట్టేందుకు కుట్ర పన్నారని సీఎం ఆరోపించారు. ఈ వ్యవహారంలో దామోదర్‌రావుకు విలాసవంతమైన కార్లను లంచంగా ఇచ్చారని, కేసీఆర్‌కు నగదు రూపంలో ముడుపులు అందాయని విమర్శించారు. హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా విలువైన భూములను కబ్జా చేసేందుకు బీఆర్ఎస్ నేతలు ప్రయత్నించారని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లలోనే రూ.1.50 లక్షల కోట్ల విలువైన భూములను ఆక్రమణదారుల నుంచి కాపాడినట్లు వెల్లడించారు.

కబ్జాలపై న్యాయపోరాటం

కేటీఆర్ భలేరావు కుటుంబ సభ్యులతో కుమ్మక్కై ఐఎంజీ భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించగా న్యాయపోరాటంతో అడ్డుకున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. కంచె గచ్చిబౌలి, మామిడిపల్లి భూములను బీఆర్ఎస్ నాయకులు కబ్జా చేసేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నామన్నారు. గుర్రంగూడ అటవీ భూములను కేటీఆర్ అనుచరులు ఆక్రమించేందుకు యత్నించగా సుప్రీంకోర్టులో పోరాడి అవి అటవీ భూములేనని నిర్ధారించామని చెప్పారు. మంచిరేవులలో 143 ఎకరాల భూమిని కేటీఆర్ రాయలసీమ బిల్డర్స్‌తో కలిసి ఆక్రమించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఆ భూములను కాపాడి పోలీసుల పిల్లల కోసం పాఠశాల నిర్మించినట్లు వివరించారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో బీఆర్ఎస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేకు నజరానాగా ఇచ్చిన 400 ఎకరాల అటవీ భూమిని సుప్రీంకోర్టులో పోరాడి దక్కించుకున్నామని సీఎం తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ భూఆక్రమణలను అడ్డుకున్నామన్నారు. హరీశ్‌రావు మామ హనుమంతరావు ఆక్రమించుకున్న భూముల సర్వేను అడ్డుకోవడంతోపాటు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో పద్మాలయ స్టూడియో, ల్యాంకో భూములపై కేసులు వేసిన కేసీఆర్, హరీశ్‌రావు అధికారంలోకి వచ్చాక వాటిని స్వాధీనం చేసుకోకుండా లాలూచీ పడ్డారని ఆరోపించారు.

విక్రయ ఆదాయం అభివృద్ధికి

మియాపూర్ సహా ప్రభుత్వం పరిరక్షించిన భూముల విక్రయం, నిధుల సమీకరణపై నియమించిన మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేస్తుందని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. భూముల విక్రయం ద్వారా వచ్చే ఆదాయాన్ని నీటిపారుదల, విద్య, వైద్య రంగాలకు, ముఖ్యంగా విద్యాభివృద్ధికి కేటాయిస్తామని స్పష్టం చేశారు. ఈ అంశంపై మంత్రివర్గంలో చర్చిస్తామన్నారు. సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు ఇచ్చినా బీఆర్ఎస్ నేతలు స్పందించకపోవడం, రెవెన్యూ అధికారులను అభినందించకపోవడం వారి వైఖరికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో భూముల అంశంపై చర్చకు వస్తే తేలు కుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. భూఆక్రమణలపై చర్చించేందుకు ప్రతిపక్షాలు ధైర్యంగా అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. కేసీఆర్ రెండు గ్రామాల మధ్య వివాదాన్ని తనకు అనుకూలంగా మలచుకున్నారని ఆరోపించారు. అక్కడి ఆక్రమణలను తొలగించి శ్రీకాంతాచారి అమరవీరుల కాలనీ నిర్మిస్తామని ప్రకటించారు. కోర్టు తీర్పులనైనా గమనించి కేసీఆర్, కేటీఆర్ భూఆక్రమణలు మానుకోవాలని, మియాపూర్ భూములపై కుట్రలకు స్వస్తి పలకాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

ప్రభుత్వం మరో మానవీయ నిర్ణయం

- **ఇక అన్ని సామాజిక భద్రతా పింఛన్లలోనూ ఇన్‌స్టంట్ పెన్షన్ సదుపాయం**

హైదరాబాద్, అక్టోబర్ 30:

సామాజిక భద్రతకు పెద్దపీట వేస్తూ తెలంగాణ ప్రభుత్వం మరొక కీలక మానవీయ నిర్ణయం తీసుకుంది. పింఛన్‌దారులైన భర్తలు మరణించిన సందర్భాల్లో వారి భార్యలకు తక్షణమే సామాజిక భద్రతా పింఛన్ మంజూరు చేసే 'ఇన్‌స్టంట్ పెన్షన్' సదుపాయాన్ని మరిన్ని కేటగిరీలకు విస్తరిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి సీతక్క ఆదేశాలతో తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా అనేక పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించనుంది. ఇప్పటివరకు కేవలం వృద్ధాప్య పింఛన్ పొందుతున్న భర్త మరణిస్తేనే ఆయన భార్యకు ఈ ఇన్‌స్టంట్ పెన్షన్ సౌకర్యం అందుబాటులో ఉండేది. తాజాగా దీనిని దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, డయాలసిస్, హెచ్ఐవీ, ఫైలేరియా బాధితుల కుటుంబాలకు కూడా వర్తింపజేస్తూ విస్తరించారు. మరణించిన పింఛన్‌దారుడి భార్య వయస్సు 57 సంవత్సరాల కంటే తక్కువగా ఉంటే 'వితంతు పింఛన్' మంజూరు చేస్తారు. 57 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ ఉంటే 'వృద్ధాప్య పింఛన్' కింద తక్షణమే పింఛన్ అందజేస్తారు.

దరఖాస్తు విధానం & కావలసిన ధ్రువపత్రాలు

జీవిత భాగస్వామిని కోల్పోయిన మహిళలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా అండగా నిలిచేందుకు దరఖాస్తు ప్రక్రియను ఎంతో సులభతరం చేశారు: గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శికి, పట్టణ ప్రాంతాల్లో బిల్ కలెక్టర్‌కు దరఖాస్తు అందజేయాలి. భార్య ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ, మరణించిన భర్త ఆధార్ కార్డు, మరణ ధ్రువీకరణ పత్రం (డెత్ సర్టిఫికేట్). సంబంధిత అధికారులు పత్రాలను పరిశీలించి, 'చేయూత' పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి అర్హత ధ్రువీకరించుకున్న వెంటనే పెన్షన్ మంజూరు చేస్తారు.

సెక్రటేరియట్‌లో ఆక్టోపస్ మాక్ డ్రిల్

హైదరాబాద్, అక్టోబర్ 30:

ఆక్టోపస్ బృందం ఆధ్వర్యంలో ఆక్టోపస్ ఎకో స్వాట్ టీం ఎస్‌వోసీ/డీఎస్పీ బి.మరియదాసు నాయకత్వంలో వివిధ శాఖల సమన్వయంతో సచివాలయంలో శుక్రవారం ఆపరేషనల్ మాక్ డ్రిల్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ పోలీస్, అగ్నిమాపక శాఖ, సీఎస్‌జీ , తెలంగాణ స్పెషల్ పోలీస్ ఫోర్స్ (టీజీఎస్పీఎఫ్), ట్రాఫిక్ పోలీస్, వైద్య బృందం, బాంబ్ డిస్పోజల్ బృందాలు పాల్గొన్నాయి. సచివాలయంలో ఏవైనా అనుకోని భద్రతాపరమైన ముప్పు లేదా అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వివిధ భద్రతా, అత్యవసర సేవల విభాగాల సన్నద్ధత, పరస్పర సమన్వయం, స్పందనా సామర్థ్యం, కార్యాచరణ సామర్థ్యాలను అంచనా వేయడం, మరింత బలోపేతం చేయడం ఈ మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశం. ఈ విన్యాసంలో ఆక్టోపస్ అడిషనల్ ఎస్పీ (అసాల్ట్ కమాండర్) రఘునందన్ రావు, టీజీఎస్పీఎఫ్ సచివాలయం సీఎఉసవో పి.దేవిదాస్, సచివాలయం ఏసీపీ శంకర్, ఆక్టోపస్ డీఎస్పీ రామకృష్ణ, ట్రాఫిక్ ఏసీపీ మోహన్ రావు, టీజీఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్లు పవన్ కుమార్, సత్తయ్య పాల్గొన్నారు.

చమోలీలో హెలికాప్టర్ కుప్పకూలినట్లు అనుమానం

- **ఫాటా నుంచి బద్రీనాథ్ వెళ్తుండగా ప్రమాదం**
- **ఐదుగురు ప్రయాణికులు, పైలట్ ఉన్నట్లు గుర్తింపు**
- **శకలాల కోసం కొనసాగుతున్న గాలింపు**
- **ప్రతికూల వాతావరణంతో సహాయక చర్యలకు ఆటంకం**

డెహ్రాడూన్:

ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో హెలికాప్టర్ ప్రమాదం కలకలం రేపింది. జోషిమఠ్ సమీపంలోని హతి పహాడ్ వెనుక ఉన్న చాయిా గ్రామ పరిసరాల్లో హెలికాప్టర్ కూలిపోయినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. అయితే ఇప్పటివరకు ప్రమాద స్థలంలో శకలాలు గుర్తించలేదు. ఘటన సమయంలో హెలికాప్టర్‌లో ఆరుగురు ఉన్నట్లు సమాచారం. వారి ప్రాణస్థితిపై ఇంకా స్పష్టత రాలేదు.
ట్రాన్స్ భారత్ కంపెనీకి చెందిన ఈ హెలికాప్టర్ ఫాటా నుంచి బద్రీనాథ్‌కు వెళ్తుండగా ప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది. ప్రయాణికులను చంద్రకాంత్, రాజశ్రీ, దినేష్, ఆకాష్, అథర్వగా గుర్తించారు. పైలట్ హిమాంశుగా అధికారులు పేర్కొన్నారు.
ప్రమాద ప్రాంతంలో దట్టమైన మేఘాలు కమ్ముకోవడంతో పాటు వర్షం కురుస్తోంది. తక్కువ దృశ్యమానత కారణంగా హెలికాప్టర్ కూలిన ప్రదేశాన్ని గుర్తించడం కష్టంగా మారింది. బద్రీనాథ్, జోషిమఠ్ పరిసరాల్లో స్థానిక యంత్రాంగం, రెస్క్యూ బృందాలు గాలింపు చేపట్టాయి. సహాయక చర్యల కోసం మరో రెండు హెలికాప్టర్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు.
హెలికాప్టర్ కూలినట్లు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ధ్రువీకరించారు. జిల్లా యంత్రాంగం, విపత్తు నిర్వహణ శాఖ, ఎస్‌డీఆర్‌ఎఫ్ సమన్వయంతో సహాయక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రయాణికులు క్షేమంగా బయటపడాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.
ఇదిలా ఉండగా, అక్టోబర్‌లో చార్‌ధామ్ యాత్ర సమయంలోనూ రెండు హెలికాప్టర్లు అత్యవసరంగా ల్యాండ్ అయ్యాయి. ప్రతికూల వాతావరణంతో రుద్రప్రయాగ్‌లో ఒకటి, సాంకేతిక సమస్యతో టెహ్రీలో మరొకటి అత్యవసరంగా దిగాయి.

బియ్యం ధరలు పెంచితే సహించేదిలేదు

- **ఐదు శాఖల సమన్వయంతో ముమ్మర దాడులు**
- **ఇప్పటికే 12 కేసులు**
- **సరిపడ బియ్యం నిల్వలు ఉన్నాయి.. ఆందోళన చెందొద్దు**
- **పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్**

హైదరాబాద్, అక్టోబరు 30:

బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినా, బ్లాక్‌మార్కెట్‌కు తరలించినా, అధిక ధరలకు విక్రయించి ప్రజలపై భారం మోపినా కఠిన చర్యలు తప్పవని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. వినియోగదారుల అవసరాలను ఆసరాగా చేసుకుని అడ్డగోలుగా లాభాలు సంపాదించాలనుకునే వారిని ప్రభుత్వం ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. పెరుగుతున్న బియ్యం ధరలను అదుపులోకి తీసుకొచ్చి ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలను ముమ్మరం చేసినట్లు తెలిపారు.బియ్యం ధరల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఆయన బేగంపేట కుందన్ బాగ్ లోని తన క్యాంపు కార్యాలయంలో పౌర సరఫరాల శాఖాధికారులతో శుక్రవారం సమీక్షించారు. టోకు, చిల్లర వ్యాపారులు, రైస్‌మిల్లర్లతో పౌర సరఫరాల శాఖ అధికారులు జరిపిన చర్చల వివరాలను తెలుసుకున్నారు. అక్రమాల నిరోధానికి చేపట్టిన ప్రత్యేక చర్యలు, తనిఖీల పురోగతిని పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మంత్రికి వివరించారు. శాఖ డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్, ఇతర ఉన్నతాధికారులు చర్చల్లో పాల్గొన్నారు.సాధారణంగా ప్రజలు ఎక్కువగా వినియోగించే బీపీటీ బియ్యం ధర కిలో రూ.66కు మించకుండా నియంత్రణ చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ఆర్ఎన్ఆర్ బియ్యం విషయంలో నాణ్యత, ఉత్పత్తి వ్యయాల్లో ఉన్న వ్యత్యాసాలను పరిగణనలోకి తీసుకుని ధరపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు తదితర అవకతవకల ఆరోపణలపై ఇప్పటికే బియ్యం వ్యాపారులపై 12 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఐదు శాఖల సమన్వయంతో దాడులు నిర్వహిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో టోకు, చిల్లర బియ్యం మార్కెట్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు. బేగంబజార్, నాంపల్లి, మహారాజ్‌గంజ్ సహా ప్రధాన టోకు వ్యాపార కేంద్రాల్లో విస్తృత తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

గ్యాస్ కొరతపై తప్పుడు ప్రచారం

- **ఎరువులు, వంటగ్యాస్ కొరతపై ప్రతిపక్షాలది దుష్ప్రచారమన్న మోదీ**
- **రాజకీయ లబ్ధి కోసం ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని విమర్శ**
- **రైతులపై భారం పడకుండా ఎరువుల ధరల నియంత్రణకు చర్యలు**
- **26 కోట్లకు పైగా సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీ**
- **వాతావరణ మార్పులను తట్టుకునే 3 వేల కొత్త విత్తన రకాలు**

బనస్కాంత, అక్టోబర్ 30:

ఇరాన్ యుద్ధం, గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో వంటగ్యాస్, ఎరువుల కొరత ఏర్పడుతుందంటూ ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. దేశం అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో ప్రభుత్వానికి సహకరించాల్సింది పోయి, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో ఆందోళన పెంచుతున్నాయని ఆరోపించారు. గుజరాత్‌లోని బనస్కాంతలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.
దేశ ప్రజలు అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణం కోసం శ్రమిస్తుంటే.. కొన్ని రాజకీయ పార్టీలు మాత్రం దేశం సంక్షోభంలో పడాలని కోరుకుంటున్నాయని మోదీ వ్యాఖ్యానించారు. ఎరువులు, వంటగ్యాస్ కొరతపై పుకార్లు వ్యాప్తి చేస్తూ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. దేశ ప్రగతిలో యువత, మహిళలు, బాలికలు కీలక భాగస్వాములవుతున్నారని పేర్కొన్నారు.
అంతర్జాతీయ మార్కెట్లలో ఎరువుల ధరలు పెరుగుతున్నప్పటికీ, ఆ ప్రభావం భారత రైతులపై పడకుండా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రధాని తెలిపారు. గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నా రైతులపై అదనపు ఆర్థిక భారం పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కష్టకాలంలో రైతులకు అండగా ఉంటానన్న హామీకి అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు.
వ్యవసాయంలో శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించేందుకు గత 12 ఏళ్లుగా చర్యలు చేపడుతున్నామని మోదీ వెల్లడించారు. రైతులు తమ భూములకు అవసరమైన ఎరువుల రకాలు, పరిమాణాన్ని గుర్తించేందుకు సాయిల్ హెల్త్ కార్డులు ఉపయోగపడుతున్నాయని చెప్పారు. భూసార పరీక్షల ఆధారంగా తగిన ఎరువులను వినియోగించే అవకాశం వీటి ద్వారా లభించిందన్నారు. దేశవ్యాప్తంగా 26 కోట్లకు పైగా సాయిల్ హెల్త్ కార్డులను పంపిణీ చేసినట్లు తెలిపారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తట్టుకునేలా వ్యవసాయాన్ని తీర్చిదిద్దేందుకు కొత్త విత్తన రకాలను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రధాని పేర్కొన్నారు. గత కొన్నేళ్లలో దాదాపు 3 వేల కొత్త రకాల విత్తనాలను రైతులకు అందించామని తెలిపారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేసేందుకు ఇవి దోహదపడతాయని వివరించారు.



గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో పశుపోషణ, డెయిరీ రంగాలు కీలకమని మోదీ అన్నారు. ఈ రంగాల్లో మహిళల భాగస్వామ్యం ఎంతో ప్రాధాన్యమైనదని పేర్కొన్నారు. గత దశాబ్ద కాలంగా పశుపోషణ, పాల ఉత్పత్తిలో ఆధునిక సాంకేతికతను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మెరుగైన పశు జాతుల అభివృద్ధి ద్వారా పాల ఉత్పత్తిని మరింత పెంచుకోవచ్చని తెలిపారు.

ఓటు హక్కు పరిరక్షణకు రాంలీలా మైదాన్‌లో ర్యాలీ

- **నవంబర్ 1న ఇండియా కూటమి భారీ నిరసన కార్యక్రమం**
- **10 లక్షల మంది హాజరవుతారని కాంగ్రెస్ అంచనా**
- **ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారిని అడ్డుకుంటున్నారని అమిత్ షాపై రాహుల్ ఆరోపణ**
- **మోదీ, అమిత్ షా, అదానీ, అంబానీల ప్రయోజనాల కోసమే కుట్ర అంటూ విమర్శ**
- **కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ**

న్యూఢిల్లీ:

ఓటు హక్కుల పరిరక్షణ లక్ష్యంగా ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నవంబర్ 1న నిర్వహించనున్న ఇండియా కూటమి ర్యాలీకి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సుమారు 10 లక్షల మంది హాజరవుతారని కాంగ్రెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి ఢిల్లీకి చేరుకోవాలనుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలకు అడ్డంకులు సృష్టిస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై రాహుల్ ఆరోపణలు చేశారు.
ఉత్తర్‌ప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, పంజాబ్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చే వారిని నిలువరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ర్యాలీకి ఎంతమంది వస్తున్నారు? వారిలో ఎంతమందిని అడ్డుకుంటున్నారు? అన్నది గమనిస్తే దేశంలో నెలకొన్న పరిస్థితులు అర్థమవుతాయని వ్యాఖ్యానించారు.
కోట్లాది మంది ఓటు హక్కును కోల్పోతున్నారన్న ఆందోళన ప్రజల్లో పెరుగుతోందని, ఈ పరిణామాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందని రాహుల్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, పారిశ్రామికవేత్తలు అదానీ, అంబానీ, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు మేలు చేకూర్చేలా ఈ పరిణామాలు ఉన్నాయని ఆరోపించారు. ఇది విడివిడిగా చేపడుతున్న నిరసనల సమాహారం కాదని, ఒకే లక్ష్యంతో సాగుతున్న ఉద్యమమని రాహుల్ స్పష్టం చేశారు. ఈ పోరాటంలో ఇండియా కూటమిలోని ప్రతిపక్ష పార్టీలన్నీ భాగస్వాములవుతాయని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరసన తెలియజేయాలనుకునే ప్రతి ఒక్కరూ రాంలీలా మైదానానికి రావాలని పిలుపునిచ్చారు.

సమ్మిళిత అభివృద్ధి, సుస్థిరతతోనే లక్ష్య సాధన

- **2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ**
- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

హైదరాబాద్, అక్టోబర్ 30:

రాష్ట్రం 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించాలనే లక్ష్యాన్ని సాధించేందుకు అవసరమైన ప్రతిభ, పారిశ్రామిక సామర్థ్యం, సాంకేతిక పరిజ్ఞానం రాష్ట్రానికి పుష్కలంగా ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆశాభావం వ్యక్తం చేశారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (డాక్టర్ ఎం.సి.ఆర్. హెచ్.ఆర్.డి.ఐ.) స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహించిన "ఆర్థిక వృద్ధి, సుస్థిర అభివృద్ధి, ప్రజా విధానాలు" అనే రెండు రోజుల జాతీయ సదస్సును ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రచురించిన 'సమృద్ధి' జర్నల్ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఆర్థిక వృద్ధి అనేది కేవలం స్థూల ఆర్థిక గణాంకాలు, తలసరి ఆదాయ పెరుగుదలకే పరిమితం కాకూడదని, సామాన్య ప్రజల జీవన ప్రమాణాల్లో స్పష్టమైన మార్పును తీసుకురావాలని స్పష్టం చేశారు. పర్యావరణాన్ని విస్మరించి చేపటే అనాలోచిత పట్టణ విస్తరణ ప్రమాదకరమని హెచ్చరించారు. చెరువులు, సహజ నీటి వనరులను కాపాడుకోకపోతే భవిష్యత్తు తరాలపై తీవ్ర భారం పడుతుందన్నారు. మూసీ నది పునరుజ్జీవనం, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి కీలక ప్రాజెక్టులు పర్యావరణ సమతుల్యత, బాధితులకు సరైన పునరావాసం ప్రాతిపదికగా ముందుకు సాగుతాయని తెలిపారు. ప్రభుత్వ శాఖల మధ్య విభాగపరమైన గోడలను తొలగించి, వ్యవసాయం, విద్యుత్, సాగునీటి శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల సమయాన్ని వృథా చేయకుండా వేగవంతమైన సేవలు అందించడమే పరిపాలనా సామర్థ్యానికి నిజమైన కొలమానమని పేర్కొన్నారు.

సదస్సులో ప్రముఖుల భాగస్వామ్యం

ఈ జాతీయ సదస్సులో డాక్టర్ ఎం.సి.ఆర్. హెచ్.ఆర్.డి.ఐ. డైరెక్టర్ జనరల్ శాంతికుమారి, అదనపు డైరెక్టర్ జనరల్ అనితా రామచంద్రన్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, ప్రొఫెసర్ శాంతా సిన్హాతో పాటు దేశంలోని 12 రాష్ట్రాల నుంచి విచ్చేసిన సుమారు 200 మంది విద్యావేత్తలు, పరిశోధకులు మరియు విధాన నిపుణులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలను అవహేళన చేయడమే వారి నైజం

- **మాక్ పార్లమెంట్ పేరిట కాంగ్రెస్ డ్రామాలు**
- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మండిపాటు**

హైదరాబాద్, అక్టోబర్ 30:

కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండీ కూటమి రాజ్యాంగ వ్యవస్థలను అవమానించడమే పనిగా పెట్టుకుందని, ప్రజాస్వామ్య దేవాలయమైన పార్లమెంట్‌ను 'మాక్ పార్లమెంట్' పేరిట హేళన చేస్తోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు తీవ్రంగా విమర్శించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఉపాధ్యక్షులు బండారు శాంతికుమార్, రాష్ట్ర కార్యదర్శి ఓ.ఎస్. రెడ్డిలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2010లో లాలూ ప్రసాద్ యాదవ్, ములాయం సింగ్ యాదవ్ మాక్ పార్లమెంట్ నిర్వహించినప్పుడు అప్పటి స్పీకర్ మీరా కుమార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారని, స్వయంగా సోనియా గాంధీ దానిని "ఏ మాకరీ ఆఫ్ డెమోక్రసీ" (ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే) అని తప్పుబట్టారని గుర్తుచేశారు. నాటి వ్యాఖ్యలపై నేడు కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని నిలదీశారు. పండుగల రద్దీ వేళ రైల్వే నిబంధనల ప్రకారం ముందస్తు బుకింగ్ చేసుకోకుండా, తమ వైఫల్యాలను దక్షిణ మధ్య రైల్వేపై నెట్టడం క్షమించరాని చర్య అని కాంగ్రెస్ తీరును తప్పుబట్టారు.

మూసీ నిర్వాసితులకు అండ

మూసీ నది ప్రక్షాళనకు బీజేపీ వ్యతిరేకం కాదని స్పష్టం చేసిన రాంచందర్ రావు, సుందరీకరణ పేరిట నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా పేదల ఇళ్లు కూల్చితే సహించేది లేదని హెచ్చరించారు. బాధితులతో నేరుగా ప్రజాదర్బార్ నిర్వహించి, సమస్యలు పరిష్కరించిన తర్వాతే ముందుకెళ్లాలని డిమాండ్ చేశారు.

2న అమిత్ షా మహా పాదయాత్ర

నవంబర్ 2న హైదరాబాద్ విచ్చేస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొనే చారిత్రక 'మహా పాదయాత్ర' మధ్యాహ్నం 3 గంటలకు బషీర్‌బాగ్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ప్రారంభమై మొజాంజాహి మార్కెట్ వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం జరిగే బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగిస్తారని తెలిపారు.

ఓటర్ల జాబితా సవరణపై స్పష్టత

ఎస్ఎస్ఆర్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని కర్ణాటక కాంగ్రెస్ మంత్రి సతీష్ జార్కిహోళి స్వయంగా ప్రకటిస్తే, ఇక్కడ తెలంగాణ కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారాలు చేయడం హాస్యాస్పదమన్నారు.

మియాపూర్ భూముల వేలం నిర్ణయం దివాకోరుతనం.

అత్యంత విలువైన మియాపూర్ 550 ఎకరాల భూములపై సుప్రీంకోర్టు వెలువరించిన చరిత్రాత్మక తీర్పును స్వాగతిస్తున్నామని, అయితే తీర్పు వచ్చిన మరుక్షణమే ఆ భూములను వేలం వేసి అమ్మేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని రామచందర్ రావు స్పష్టం చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సర్కార్ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మియాపూర్‌లోని సర్వే నంబర్లు 100, 101 పరిధిలోని సుమారు 550 ఎకరాల భూములను గత బీఆర్ఎస్ ప్రభుత్వం తమ బంధువులకు, ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడానికి చూస్తే, సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత సుప్రీంకోర్టు ఆ భూములు ప్రభుత్వానికే చెందుతాయని తీర్పు ఇచ్చిందని, దీనిని బీజేపీ సంపూర్ణంగా స్వాగతిస్తోందన్నారు.

రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా ప్రభుత్వం

తీర్పు వెలువడగానే ఏమాత్రం ఆలోచించకుండా పక్కా రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా మారిపోయి వేలం పాట వేస్తామనడం కాంగ్రెస్ దిక్కుమాలిన వైఖరికి, పరిపాలనా దివాళాకోరుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రభుత్వ భూములను అమ్ముకుంటూ పాలన సాగిస్తారా అని ప్రశ్నించారు. ప్రజల ఆస్తులను విక్రయించడం మూర్ఖపు నిర్ణయమని, స్థానికంగా అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై ఆలోచన చేయకుండా వేలం వేయడం సరికాదన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల పోటీ:

నాడు కేసీఆర్ బంధుప్రీతి.. నేడు రేవంత్ దోపిడీ నీతి అంటూ ఎద్దేవా చేశారు. ప్రజల ఆస్తులను కాజేయడంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటీపడుతున్నాయని ఆరోపించారు. వేలం పాట ముసుగులో భూములను తమ సొంత అనుచరులకే కట్టబెట్టేందుకు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. ఈ భూములు రేవంత్ రెడ్డి కుటుంబానిదో, అనుచరుల జాగీరో కాదని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఉమ్మడి ఆస్తి అని గుర్తుచేశారు. మియాపూర్ భూముల్లో ఒక్క ఇంచు స్థలం అన్యాక్రాంతమైనా చూస్తూ ఊరుకోమని, క్షేత్రస్థాయిలో ప్రజలతో కలిసి వేలం పాటను ఖచ్చితంగా అడ్డుకుంటామని హెచ్చరించారు.

పార్టీలో భారీ చేరికలు

మీడియా సమావేశం అనంతరం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆధ్వర్యంలో నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు విశ్రాంత ఉన్నతాధికారులు, ఇంజినీర్లు బీజేపీలో చేరారు.

రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ హన్మంతరావు, ఆర్ అండ్ బీ రిటైర్డ్ ఈఈ కస్తూరి లక్ష్మీవెంకటరమణ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రిటైర్డ్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సి.హెచ్. రమేశ్, ఎస్‌బీఐ రిటైర్డ్ చీఫ్ మేనేజర్ వెంకటేశం గుప్తా, మాజీ వైశ్య సంఘం అధ్యక్షుడు భూమలింగం గుప్తాతోపాటు పలువురు ప్రముఖులకు రామచందర్ రావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

జాతి ఐక్యతకు జీవం పోసిన భారత 'ఉక్కుమనిషి'

- నేడు 'సర్దార్ వల్లభభాయ్ పటేల్' జయంతి
- జాతీయ ఐక్యతా దినోత్సవం

భారతదేశ చరిత్రలో అక్టోబర్ 31వ తేదీకి విశిష్ట స్థానం ఉంది. భారతదేశ తొలి ఉప ప్రధానమంత్రి, హోంమంత్రి, భారత స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఈ రోజును జాతీయ ఐక్యతా దినోత్సవంగా నిర్వహిస్తారు. 1875 అక్టోబర్ 31న గుజరాత్‌లోని నడియాద్‌లో జన్మించిన పటేల్ దేశ సమైక్యత కోసం చేసిన కృషి చిరస్మరణీయం.భారతదేశం ఒక భౌగోళిక చిత్రం మాత్రమే కాదు... కోట్లాది హృదయాలను కలిపే ఒక మహత్తర భావన. ఆ భావనకు ఐక్యత అనే పునాది వేసిన మహనీయుల్లో సర్దార్ వల్లభభాయ్ పటేల్ అగ్రగణ్యులు. దేశం స్వాతంత్ర్యపు వెలుగుల్లోకి అడుగుపెట్టిన వేళ ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. భిన్న భాషలు, విభిన్న సంస్కృతులు, వేర్వేరు సంస్థానాలతో ఉన్న భారతదేశాన్ని ఒకే జాతీయ పతాకం కిందకు తీసుకురావడం అంత సులభమైన పని కాదు. అలాంటి క్లిష్ట సమయంలో తన అసాధారణ నాయకత్వంతో, అచంచలమైన సంకల్పంతో దేశ సమైక్యత కోసం కృషి చేసిన మహానేత సర్దార్ వల్లభభాయ్ పటేల్.అందుకే ఆయన కేవలం ఒక నాయకుడు కాదు... అఖండ భారతదేశ నిర్మాణంలో చెరగని ముద్ర వేసిన చరిత్ర పురుషుడు!1875 అక్టోబర్ 31న గుజరాత్‌లోని నడియాద్‌లో జన్మించిన పటేల్ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. రైతుల హక్కుల కోసం పోరాడి ప్రజల గుండెల్లో స్థానం సంపాదించారు. స్వాతంత్ర్యం అనంతరం భారతదేశ తొలి ఉప ప్రధానమంత్రిగా, హోం మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తూ సంస్థానాల విలీనానికి విశేష కృషి చేశారు.ఆయన నాయకత్వంలో సాగిన జాతీయ సమైక్యతా ప్రయత్నాలు భారతదేశ చరిత్రలో ఒక కీలక అధ్యాయంగా నిలిచిపోయాయి. కఠినమైన నిర్ణయాలు తీసుకోవడంలో వెనుకాడని ధైర్యం, దేశ ప్రయోజనాల విషయంలో రాజీపడని నిబద్ధత ఆయనను 'భారత ఉక్కుమనిషి'గా నిలబెట్టాయి.కాలం మారింది. తరాలు మారాయి. ప్రపంచం ఆధునికత వైపు పరుగులు తీస్తోంది. అయినప్పటికీ పటేల్ అందించిన ఐక్యతా సందేశం నేటికీ అంతే ప్రాసంగికంగా ఉంది.కులం పేరుతో కలహాలు, మతం పేరుతో విభేదాలు, ప్రాంతం పేరుతో విద్వేషాలు పెరుగుతున్న తరుణంలో మనమంతా భారతీయులమనే భావన మరింత బలపడాల్సిన అవసరం ఉంది.దేశభక్తి అంటే కేవలం జాతీయ పతాకాన్ని ఎగురవేయడం కాదు. దేశంలోని ప్రతి పౌరుడిని గౌరవించడం, భిన్నత్వాన్ని అంగీకరించడం, సమాజంలో సోదరభావాన్ని పెంపొందించడం కూడా దేశభక్తిలో భాగమే.ఒకరినొకరు గౌరవించుకున్నప్పుడు దేశం బలపడుతుంది. ఒకరి కష్టాన్ని మరొకరు అర్థం చేసుకున్నప్పుడు సమాజం ముందుకు సాగుతుంది. మన మధ్య ఐక్యత ఉన్నప్పుడే భారతదేశం ప్రపంచంలో మరింత ఉన్నతంగా నిలుస్తుంది.సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం అక్టోబర్ 31న జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా దేశ సమగ్రతను కాపాడతామని, ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తామని ప్రతి ఒక్కరూ సంకల్పించాలి.పటేల్ విగ్రహాలకు నివాళులర్పించడం మాత్రమే కాకుండా, ఆయన ఆశయాలను మన జీవితాల్లో ఆచరించడమే ఆయనకు అందించే నిజమైన గౌరవం.దేశం కోసం మనం ఏం చేశామన్న ప్రశ్న ప్రతి పౌరుడి హృదయంలో మెదలాలి. మన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, భవిష్యత్ తరాలకు ఐక్యమైన భారతదేశాన్ని అందించాలి.ఒక వ్యక్తి సంకల్పం చరిత్రను మార్చగలదు. ఒక నాయకుడి దూరదృష్టి దేశ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేయగలదు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ జీవితం అందుకు నిదర్శనం.ఆయన చూపిన బాటలో నడుస్తూ, విభేదాలను పక్కనపెట్టి, ఐక్యతను మన జీవన విధానంగా మార్చుకున్నప్పుడే ఆయన కలలు గన్న బలమైన భారతదేశ నిర్మాణానికి మన వంతు సహకారం అందించినవారమవుతాం. ఐక్యత మన బలం... సమగ్రత మన బాధ్యత... అఖండ భారతదేశం మనందరి ఆకాంక్ష! ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్‌కు ఘన నివాళి.

నాలుగు దశాబ్దాల నిరీక్షణకు తెర

- పోతననగర్‌లో రూ.1.50 కోట్లతో పనులకు శ్రీకారం
- త్వరలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు... ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

వరంగల్, అక్టోబర్ 30 : : వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో సమగ్ర అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. 11వ డివిజన్ పరిధి పోతననగర్‌లో రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రహదారులు, సైడ్ డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోతననగర్‌లో నాలుగు దశాబ్దాలుగా రహదారుల సమస్య ఉందన్నారు. వర్షాకాలంలో డాంబరు రహదారులు దెబ్బతింటుండటంతో శాశ్వత పరిష్కారంగా సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి మురుగునీరు రహదారులపైకి రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.నియోజకవర్గంలోని 26 డివిజన్లకు రాజకీయాలకు అతీతంగా ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. ఒక్కో డివిజన్‌కు రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు అభివృద్ధి నిధులు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. త్వరలో యూజీడీ పనులు.వరంగల్ నగరంలో త్వరలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనులు ప్రారంభం కానున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. పనుల సమయంలో రహదారులు తవ్వాల్సి రావచ్చని, ప్రజలు తాత్కాలిక ఇబ్బందులను ఓర్చుకొని సహకరించాలని కోరారు. యూజీడీ పూర్తయితే మురుగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.నగర అభివృద్ధి, పారిశ్రామిక రంగ విస్తరణ, ఐటీ సంస్థల ఏర్పాటు, యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ గుండు మాజీ ఎమ్మెల్సీ డివిజన్ ఇన్‌చార్జి బోడ డిన్న, మాజీ కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, డివిజన్ అధ్యక్షుడు, మాజీ అధ్యక్షుడు పాల్గొన్నారు.

జలసిరి పనులతో భూగర్భ జలాల అభివృద్ధికి కృషి చేయాలి

- ఫారంపాండ్ నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

ఆలేరు, అక్టోబర్ 30:: గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణకు ప్రాధాన్యమిస్తూ, రైతుల ఆదాయ వృద్ధికి దోహదపడే పనులను విస్తృతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులకు, రైతులకు సూచించారు.యాదాద్రి భువనగిరి జిల్లా మందనపల్లి గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం వి బిజీ రామ్ జి పథకంలో భాగంగా జలసిరి కార్యక్రమం కింద కడకంచి స్వామి భూమిలో చేపడుతున్న ఫారంపాండ్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల్లో పాల్గొంటున్న కూలీలతో మాట్లాడి పనుల పురోగతి, కూలి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు జలసిరి కార్యక్రమం ద్వారా వివిధ రకాల నీటి సంరక్షణ పనులను చేపట్టాలని సూచించారు. రైతులు వ్యవసాయంతో పాటు అదనపు ఆదాయం పొందేలా మునగ తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. ప్రతి గ్రామంలో ఫారంపాండ్ల నిర్మాణం, ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టాలని పేర్కొన్నారు. అదేవిధంగా పశువుల సంరక్షణకు అవసరమైన షెడ్ల నిర్మాణం, పశువులకు నీటి తొట్ల ఏర్పాటు వంటి పనులను కూడా ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. కూలీలకు రోజుకు రూ.308 కూలి లభించే విధంగా నిబంధనల ప్రకారం పనులు నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు. గ్రామాల్లోని చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచవచ్చని కలెక్టర్ తెలిపారు. దీనివల్ల వర్షపు నీరు ఎక్కువ మొత్తంలో నిల్వ ఉండటంతో పాటు భూగర్భ జలాల మట్టం పెరిగి, వ్యవసాయ అవసరాలకు నీటి లభ్యత మెరుగుపడుతుందని వివరించారు. రాబోయే రోజుల్లో నీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రతి గ్రామపంచాయతీలో నీటి సంరక్షణ, గ్రామీణాభివృద్ధి పనులను గుర్తించి సమగ్ర ప్రణాళికతో అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రేణుక, ఉపసర్పంచ్, డీఆర్‌డీవో నాగిరెడ్డి, ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, తహసీల్దార్ ఆంజనేయులు, ఏపీవో అరుణకుమారి, ఇన్‌చార్జి ఇంజినీరింగ్ కన్సల్టెంట్ వై. రామచంద్రయ్యచారి, టెక్నికల్ అసిస్టెంట్ మానస, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

భట్టి డైరెక్షన్ లో సీపీ కట్టుకథలు

- అసలు హంతకులను కాపాడేందుకు సీపీ సునీల్ దత్ డ్రామా
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని ఆరోపణలు

ఖమ్మం, అక్టోబర్ 30 : ఖమ్మం సీపీ డైరెక్షన్ లో సామినేని రామారావు హత్య కేసు దర్యాప్తు పూర్తిగా పక్కదారి పట్టించేలా సాగుతోందని, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క డైరెక్షన్ లోనే ఈ డ్రామా స్క్రిప్ట్ నడుస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించారు. స్థానిక సుందరయ్య భవన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన సామినేని రామారావు హత్య విషయంలో పలు ఆరోపణలు చేశారు. రామారావు హత్యలో అసలు హంతకులను, రౌడీలను, గూండాలాను కాపాడేందుకు పోలీస్ కమిషనర్ అన్ని ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. మొదటి నుంచి తాము చెబుతున్నట్లుగానే రామారావు రిమాండ్ రిపోర్ట్ లో 14 మంది సాక్షులను విచారించామని చెప్పినప్పటికీ, అందులో ఇద్దరు ఉద్యోగులు మినహా మిగిలిన వాళ్ళంతా వేరే పేర్లు చెబుతున్నారని విమర్శించారు. బట్టి విక్రమార్క చెబితే సీపీ సునీల్ దత్ ఈ కట్టు కథ అల్లుతున్నారని,హత్య వెనుక అసలు మోటివ్ ను పక్కన పెట్టి, సంబంధం లేని అంశాలను తెరపైకి తెస్తూ తప్పుడు కథలు అల్లుతున్నారని ఆరోపించారు. రామారావు హత్యకు కారణమైన హంతకులను శిక్షించే వరకు అసలు దోషులు పట్టబడే వరకు సీపీఎం పార్టీ తరఫున న్యాయపోరాటం చేస్తామని, రాజీలేని పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ హత్యపై సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.సీపీ ఖమ్మం జిల్లా ప్రజల ముందు పెద్ద నాటకం చూపించారని అన్నారు. భట్టి మధిర నియోజకవర్గం లో హత్యాకాండ ద్వారా రాజకీయాలు చేస్తున్నారని, ఇప్పటి వరకు సీపీఎం కు చెందిన ముగ్గుర్ని హత్య చేశారని చెప్పారు. భట్టి అన్యాయాలు,అవినీతిని, అక్రమాలు ప్రశ్నించినందుకే సామినేని రామారావు ను హత్య చేశారని ఆరోపించారు. హత్యకు నెల రోజుల ముందు రామారావు పెద్ద ఎత్తున పాదయాత్ర చేశారని పేర్కొంటూ అ సందర్భంగా రామారావు ప్రసంగం ఆడియో ను విలేకరులకు వినిపించారు. భట్టికి సీపీ మొదట నుంచి ఊడిగం చేస్తున్నారని ధ్వజమెత్తరు.ప్రజా భవన్ లో భట్టి సమక్షంలో తయారు చేసిన స్క్రిప్ట్ ను సీపీ అమలు చేస్తున్నారని, కానీ నాటకం అట్టర్ ఫ్లాప్ కాక తప్పదని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ లాంటి భట్టి డైరెక్షన్ లో జ్ఞానేష్ కుమార్ లాంటి సీపీ అన్యాయానికి తెర లేపారని విమర్శించారు. ఫోరెన్సిక్ టెస్ట్ కు రాలేదని నేరస్తులు అనడం సరికాదన్నారు.సీపీ ఇప్పటికైనా ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. హంతకులను పట్టుకునే దాకా సీపీఎం ఎవర్ని వదిలి పెట్టదని, పెద్ద ఎత్తున పోరాడుతుందని, న్యాయపోరాటం కూడా చేస్తామని చెప్పారు. పొలిటికల్ మర్డర్ అంటున్న సీపీ 10 జన్మ లెత్తినా ఈ కేసును తేల్చలేరని అన్నారు. భట్టి ప్రోత్సాహం తోనే రామారావు ను హత్య చేశారన్నది వాస్తవమని అన్నారు. ఆర్థిక వ్యవహారాలు కూడా కారణమంటున్నారని, ఛాలెంజ్ చేస్తున్నామని,అధికారంలో వారే ఉన్నారని,అవేమిటో తెల్చాలని డిమాండ్ చేశారు. సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఐపీఎస్ వ్యవస్థకే కళంకం తెచ్చేలా వ్యవహరిస్తున్న పోలీస్ కమిషనర్ ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రామారావు భార్య గుర్తు పట్టి కొందరి పేర్లు చెప్పినా వారిని విచారించలేదన్నారు. సంవత్సరమైనా హంతకులను పట్టుకోలేక, వర్ధంతి వస్తుండడం తో హడావిడిగా ఎవర్నో పట్టుకొచ్చి సరికొత్త నాటకానికి తెరతీసారని ఆరోపించారు. ముఖ్యమంత్రి, డిజిపిని కలిసి, సిట్ విచారణ కోరతామన్నారు. సీపీ ని వెంటనే సస్పెండ్ చేయాలని కూడా కోరతామన్నారు..విలేకరుల సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్, బండి పద్మ, కళ్యాణం వేంకటేశ్వరరావు, మాదినేని రమేష్, విక్రమ్, పార్టీ సీనియర్ నాయకులు చింతలచెర్వు కోటేశ్వరరావు,మధిర డివిజన్ కార్యదర్శి ఎం. గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థుల రవాణా సౌకర్యార్థం

- బస్సు ప్రారంభించిన..
- మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్

కొడంగల్ మున్సిపల్, అక్టోబర్,30: కొడంగల్ పట్టణంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థుల రవాణా సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మరియు కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జి ఎనుముల తిరుపతి రెడ్డి కృషితో ప్రభుత్వంచే విద్యార్థులకు అందించిన బస్సును శుక్రవారం కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయ బృందం, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్‌లో వైభవంగా శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామివారి

- ఆలయ ప్రాకార ప్రథమ శిలేష్టికాన్యాస కార్యక్రమం !

కొడంగల్ మున్సిపల్, అక్టోబర్,30: కొడంగల్ నియోజకవర్గానికి ఆధ్యాత్మికంగా ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలనే సంకల్పంతో సుమారు రూ.100 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్న శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామివారి ఆలయ నిర్మాణ కార్యక్రమం శుక్రవారం భక్తిశ్రద్ధలతో విజయవంతంగా జరిగింది. కొడంగల్ గడ్డ నుంచి ముఖ్యమంత్రిగా ఎదిగిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తన సొంత నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ఈ ఆలయాన్ని గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పం చేయడం కొడంగల్ ప్రజలకు ఆనందకరం. ఈ గొప్ప ఆలోచనకు ముఖ్యమంత్రి కి హృదయపూర్వక కృతజ్ఞతలు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఏ. తిరుపతిరెడ్డి స్వయంగా తొలి పూజా కార్యక్రమంలో పాల్గొని, స్వామివారి గర్భగుడి నిర్మాణానికి తొలి ఇటుకను తన చేతుల మీదుగా ఉంచి కార్యక్రమాన్ని ప్రారంభించడం ఈ వేడుకలో ప్రత్యేక ఘట్టంగా నిలిచింది.అదేవిధంగా ఈ ఆలయ నిర్మాణానికి గతంలో కొడంగల్ మున్సిపల్ చైర్మన్ శ్రీ నందారం ప్రశాంత్ కుటుంబం అందించిన కృషి, సహకారం అభినందనీయం. వారి కుటుంబం చేసిన సేవలు ఈ ఆలయ ప్రస్థానంలో గుర్తుంచుకోదగినవి .ఈ కార్యక్రమంలో కొడంగల్ తాలూకా పరిధిలోని వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల నాయకులు ,ప్రజాప్రతినిధులు, పట్టణ నాయకులు, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.కొడంగల్ అభివృద్ధిలో మరో మైలురాయిగా,భవిష్యత్తులో తెలంగాణ తిరుపతిగా ప్రత్యేక గుర్తింపు పొందుతూ భక్తుల విశ్వాసానికి ప్రతీకగా ఈ ఆలయం విరాజిల్లాలని ఆకాంక్షిద్దాం.

వలిగొండలో పట్టభద్రుల ఓటరు నమోదు

- కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి.

వలిగొండ అక్టోబర్ 30 : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు నమోదు కోసం ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఈరోజు పరిశీలించారు.ఈ సందర్భంగా ఓటరు నమోదు కేంద్రంలో జరుగుతున్న ప్రక్రియను, ఆన్‌లైన్ ద్వారా పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునే విధానాన్ని, ఇప్పటివరకు జరిగిన నమోదు ప్రక్రియ పురోగతిని సంబంధిత నాయకులను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును పొందేందుకు నిర్ణీత విధానంలో ఆన్‌లైన్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వలిగొండ పట్టణ, మండల ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మదర్ థెరిసా హైస్కూల్‌లో న్యాయ, పోలీసు అధికారుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

భువనగిరి అక్టోబర్ 30 : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి బాలల హక్కుల పరిరక్షణ, భద్రతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు భువనగిరిలోని మదర్ థెరిసా హైస్కూల్‌లో బాల్య వివాహాలు, బాల కార్మికత్వం, పోక్సో చట్టం, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా భువనగిరి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం. ఉషశ్రీ, ఎక్సైజ్ ఎస్ఐ అజీమ్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సాయి శ్రీనివాస్, భరోసా కేంద్రం ఎస్ఐ సంధ్య, డీసీపీయూ అధికారి దశరథ్ పాల్గొని విద్యార్థులకు చట్టాలు, బాలల హక్కులు, భద్రతపై అవగాహన కల్పించారు. పాఠశాల కరస్పాండెంట్ చిన్నన్ సురేష్ పాల్గొన్నారు.బాల్య వివాహాలు, బాల కార్మికత్వం వల్ల కలిగే అనర్థాలు, పోక్సో చట్టం ప్రాధాన్యత, మాదకద్రవ్యాల వల్ల కలిగే ప్రమాదాలను అధికారులు వివరించారు. విద్యార్థులు తమ హక్కులపై అవగాహనతో అప్రమత్తంగా ఉండాలని, బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో 8, 9, 10వ తరగతులకు చెందిన సుమారు 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

భువనగిరి చెరువు కట్టపై కలెక్టర్, ఎస్పీ శ్రమదానం

భువనగిరి అక్టోబర్ 30 : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని చెరువు కట్టపై శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు.జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఐఏఎస్, జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ స్వయంగా శ్రమదానంలో పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. చెత్తాచెదారాన్ని తొలగిస్తూ పారిశుద్ధ్య పనులు చేపట్టారు.ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ "స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత శ్రమదానం సామాజిక కర్తవ్యం" అని పేర్కొన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత బాధ్యత, సామాజిక సేవపై ప్రజల్లో అవగాహన కల్పించడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు.పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహిస్తున్న సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సమాజహితం, ప్రజా సంక్షేమం, సామాజిక బాధ్యతపై ప్రజలకు సందేశం అందిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ లక్ష్మినారాయణ, డీఎస్పీలు రవీందర్, శ్రీనివాస్ నాయుడు, సురేష్, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, మున్సిపల్ చైర్మన్ శ్రీ వాణి, గ్రంథాలయ చైర్మన్ అవైస్ చిస్టి, డిఫెన్స్ విద్యార్థులు, డైలీవాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాయపోల్ మండల కేంద్రంలో..

- **బిఆర్ఎస్ శ్రేణుల..అలయ్.. బలయ్ కార్యక్రమం..**
- **హాజరుకానున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి..**

రాయపోల్ అక్టోబర్ 30. : సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలోని జివిఎల్ఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగే బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల మధ్య జరిగే అలయ్.. బలయ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అందులో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర శర్మ శుక్రవారం పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు. మాజీ జడ్పిటిసి. మాజీ ఎంపీపీ మాజీ ఎంపీటీసీలు. మండల బీఆర్ఎస్ పార్టీ కమిటీలోని బాధ్యులందరూ హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీ గ్రామ బూతు స్థాయి. గ్రామ స్థాయి మండల కమిటీ స్థాయిలో ఉన్న ప్రతి ఒక్క కార్యకర్త హాజరుకావాలని పేర్కొన్నారు. మండలంలోని 19 గ్రామపంచాయతీలో పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన పార్టీ అభిమానులు. ప్రజలు రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అలయ్.బలయ్ కార్యక్రమాన్ని న్ని విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. కాగా ఈ అలయ్.బలయ్ కార్యక్రమం ద్వారా కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని ప్రతి ఒక్క కార్యకర్త హాజరై జయప్రదం చేయాలని ఆయన పేర్కొన్నారు.

స్వచ్ఛత సేవా కార్యక్రమం

వలిగొండ అక్టోబర్ 30 : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో రామన్నపేట ప్రాజెక్టులోని వలిగొండ గ్రామంలో స్వచ్ఛత సేవా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ వెంకట పాపి రెడ్డి సిడిపిఓ వెంకటరమణ మేడం ఐసిడిఎస్ సూపర్వైజర్ పారిజాత,వార్డ్ మెంబెర్స్, గ్రామపంచాయతీ సెక్రటరీ రసూల్ అంగన్వాడీ టీచర్స్ గ్రామ ప్రజలు తల్లులు హాజరు కావడం జరిగింది.

వేసవిలో తాగునీటి సరఫరా లో ఇబ్బంది లేకుండా చర్యలు

- **ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

శంషాబాద్, అక్టోబర్ 30: వేసవిలో తాగునీటి సరఫరా లో ఇబ్బంది కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. శుక్రవారం శంషాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాల అభివృద్ధి పనులు, తాగునీరు, విద్యుత్, రోడ్లు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై అధికారులతో సమీక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అందరూ సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు. సమావేశంలో సర్పంచులు కోటేష్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, బిక్యానాయ రవి నాయక్, లక్ష్మీ లింగం, సుజాత గౌడ్ తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎల్నినో ప్రభావంతో కరెంటు, నీటిని పొదుపుగా వాడుకోవాలి

వలిగొండ అక్టోబర్ 30 : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వెల్వర్తి ఎల్నినో ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని గ్రామాలలో ప్రజలు, రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని మండల వ్యవసాయ అధికారిని అంజనీ దేవి అన్నారు. శుక్రవారం మండలంలోని వెలువర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రామసభలో ఆమె మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎల్నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడతాయని, నీరు, కరెంటు పొదుపుగా వాడుకోవాలని, రైతులు వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలు పండించాలని రైతులను కోరారు. ఇంటి సౌకర్యాల కోసం వాడుకునే నీటిని కూడా పొదుపుగా వాడుకొని, మురుగు నీటిని రోడ్లపైకి వదలకుండా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని పలువు అధికారులు గ్రామ ప్రజలకు, మహిళలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెమడాల అనిత నర్సింగ్ యాదవ్, స్పెషల్ ఆఫీసర్ జగన్మోహన్ రావు, అగ్రికల్చర్ ఆఫీసర్ అంజనీ దేవి, మిషన్ భగీరథ ఏఈ కీర్తి, పంచాయతీ సెక్రెటరీ గిరిబాబు, జిపిఓ వెంకటేశం, గ్రామపంచాయతీ సిబ్బంది, ఆశా వర్కర్లు, ప్రజలు, రైతులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు

సురక్ష బచ్‌పన్ అభియాన్- బాలల హక్కులు

- **పి ఓ సి ఎస్ ఓ చట్టం–2012పై న్యాయ అవగాహన సదస్సు.**

రామన్నపేట అక్టోబర్ 30 : యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, యాదాద్రి భువనగిరి జిల్లా వారి ఆదేశాల మేరకు, రామన్నపేట మండల కేంద్రంలోని మదర్ థెరిసా హైస్కూల్ ఆవరణలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో ఈ రోజు "సురక్ష బచ్‌పన్ అభియాన్ బాలల హక్కులు మరియు పి ఓ సి ఎస్ ఓ చట్టం-2012" అనే అంశంపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్. శిరీష, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, రామన్నపేట హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నప్పటి నుంచే తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, బాలల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సదస్సులో భాగంగా బాలలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం పిఓ సిఎస్ఓ యాక్ట్-2012), గుడ్ టచ్-బ్యాడ్ టచ్, బాలల హక్కులు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, ఇంటర్నెట్ మరియు సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆపద సమయంలో సహాయం కోసం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీస్ హెల్ప్‌లైన్ 112, న్యాయ సహాయం కోసం 15100 నంబర్లను సంప్రదించవచ్చని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సోషల్ మీడియాను విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి, తమ భవిష్యత్తు లక్ష్యాలను చేరుకోవడానికి ఉపయోగించుకోవాలని, అనవసరమైన ఆకర్షణలకు దూరంగా ఉంటూ చదువుపై పూర్తి శ్రద్ధ చూపాలని సూచించారు. ఉన్నత విద్యను అభ్యసించి, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడంతో పాటు మంచి పౌరులుగా ఎదిగి సమాజ అభివృద్ధికి, దేశ పురోగతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కునూరు శ్రీనివాస్, ప్యానెల్ అడ్వకేట్ కె. శ్రీశైలం, అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ సభ్యుడు కె. యాదయ్య, పారా లీగల్ వాలంటీర్ పాల్గొని విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. పాఠశాల ప్రిన్సిపల్ మార్టిన్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మరియు విద్యార్థినీ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బాలల హక్కుల పరిరక్షణ, బాలల భద్రత, చట్టాలపై అవగాహన పెంపొందించడంలో ఇటువంటి న్యాయ అవగాహన కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

బోర్లు ఆగడం లేదు – నిబంధనలకు తూట్లు

- **కాంగ్రెస్ నేతల అండతో మల్కాజిగిరిలో యథేచ్ఛగా బోరుబావుల తవ్వకం**

మల్కాజిగిరి: ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటి, వర్షాలు కురవక తెలంగాణలో ఇప్పటికే కరువు ఛాయలు కనిపిస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో కొత్త బోర్లు వేయరాదంటూ ప్రభుత్వం కఠిన నిబంధనలు జారీ చేసింది. అయినా మల్కాజిగిరి ప్రాంతంలో ఆ ఆదేశాలను గాలికొదిలేసి, ఎక్కడ పడితే అక్కడ బోర్లు తవ్వుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తూ మౌనం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.నేతల పేరు చెప్పి తవ్వకాలుఒకవైపు భూగర్భ జలాలు పాతాళానికి చేరి, తాగునీటికీ కటకట ఏర్పడుతున్న పరిస్థితుల్లో.. ప్రాంతంలో బోర్ల వ్యాపారం మాత్రం జోరుగా సాగుతోంది. స్థానిక కాంగ్రెస్ నాయకుల అండదండలతోనే బోర్లు వేయిస్తున్నామని యజమానులు బహిరంగంగానే చెబుతున్నారు. అధికారులు తనిఖీకి వెళ్లినా, "కాంగ్రెస్ నాయకుడు చెప్పాడు" అంటూ ఎదురు సమాధానం ఇస్తున్నారని తెలుస్తోంది. వాల్టా చట్టం ఉల్లంఘనవాల్టా (నీరు, భూమి, చెట్ల రక్షణ) చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో భూగర్భ జల శాఖ అధికారులు ఇచ్చిన అనుమతులనే ఆసరాగా చేసుకుని ఇప్పుడు కొత్త బోర్లు వేస్తున్నారని స్థానికులు అంటున్నారు.అధికారుల వివరణఈ విషయంపై భూగర్భ జలాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ నరేష్‌ను వివరణ కోరగా, గృహ అవసరాలకు వినియోగించే బోర్లను 400 అడుగుల లోతు వరకు వేసుకోవడానికి నిబంధనల్లో అవకాశం ఉందని, దాని ఆధారంగానే అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఈ అనుమతి ఐదేళ్ల వరకు చెల్లుబాటు అవుతుందని, ఆ తర్వాత తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పర్యావరణవేత్తల డిమాండ్ఒకవైపు ప్రభుత్వమే బోర్లు వేయవద్దని ఆదేశాలు ఇస్తుంటే, మరోవైపు పాత అనుమతి పత్రాలను అడ్డం పెట్టుకుని తవ్వకాలు కొనసాగించడం సరికాదని పర్యావరణ ప్రేమికులు అంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి, కొత్త బోర్లకు అనుమతులు నిలిపివేసి, భూగర్భ జలాలను కాపాడాలని వారు కోరు

మల్కాజిగిరి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి

- **పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వినతులు**
- **MMC కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డితో భేటీ.. పలు అభివృద్ధి ప్రతిపాదనలపై చర్చ**

మల్కాజిగిరి, అక్టోబర్ 30 :: మల్కాజిగిరి నియోజకవర్గంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (MMC) కమిషనర్ టీ. వినయ్ కృష్ణారెడ్డిని కలిసి పలు అభివృద్ధి పనులకు సంబంధించిన వినతిపత్రాలను సమర్పించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టాల్సిన పనులు, పెండింగ్ సమస్యలపై కమిషనర్‌తో విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా అల్వాల్ గ్రామకంఠంలో ఇప్పటికే మంజూరైన ఫైర్ స్టేషన్ నిర్మాణానికి ఎదురవుతున్న అడ్డంకులను తొలగించి పనులు ప్రారంభించాలని కోరారు. నియోజకవర్గంలో ప్రతిపాదించిన CRMP రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, AOC పరిధిలో అదనపు రహదారుల నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయినందున వర్క్ స్టార్ట్ పర్మిషన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.సఫిల్‌గూడ లిమిటెడ్ హైట్ సబ్‌వే (LHS) నిర్మాణానికి సంబంధించి ఆర్మీ భూముల పరిధిలో ఉన్న అడ్డంకులను తొలగించి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నేరేడ్‌మెట్ సర్వే నంబర్ 222లో బ్రాహ్మణ కమ్యూనిటీకి ప్రతిపాదించిన స్థలానికి సంబంధించి తహసీల్దార్ ద్వారా స్థల కేటాయింపు, పొజిషన్ అప్పగించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.కౌకూర్ ఫైర్ రేంజ్ సమీపంలో రక్షణ శాఖ నుంచి అవసరమైన NOC, అనుమతులు లేకుండానే నాలా ఆక్రమణకు పాల్పడి భారీ భవనాల నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. మచ్చబొల్లారం ప్రాంతంలో పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని వివరిస్తూ, డైరీ ఫామ్ రోడ్డులోని ఆర్మీ భూముల్లో ఒక ఎకరం స్థలం కేటాయించేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేయాలని సూచించారు.యాప్రాల్ జంక్షన్‌ను రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ కింద అభివృద్ధి చేయడంతో పాటు అల్వాల్ హైటెన్షన్ లైన్ పరిధిలో రహదారి అభివృద్ధి, జవహర్‌నగర్ నుంచి యాప్రాల్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కోరారు. అల్వాల్ చిన్నరాయుని చెరువు పరిధిలో FTL కాకుండా బఫర్ జోన్ భూమిని అప్పగించే వారికి TDR కల్పించే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. బండ చెరువును ఆధునికంగా అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని, విమలాదేవి నగర్‌లోని బావి స్థలంలో అక్రమ నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా RK పురం ఫుట్‌బాల్ గ్రౌండ్, డిఫెన్స్ కాలనీలో బ్యాడ్మింటన్ కోర్టు, మౌలాలిలో స్విమ్మింగ్ పూల్ నిర్మాణం, బండ చెరువు అభివృద్ధికి ఇప్పటికే మంజూరైన నిధులను విడుదల చేసి పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు, బాక్స్ డ్రైన్లు, పార్కులు, ఓపెన్ జిమ్‌లు, స్మశాన వాటికల అభివృద్ధితో పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన ప్రతిపాదనలను కూడా కమిషనర్‌కు అందజేశారు.సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాంఎమ్మెల్యే సమర్పించిన వినతులపై MMC కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో చర్చించి, సాధ్యమైన మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, తాగునీరు, క్రీడా మైదానాలు, పార్కులు, ప్రజా భద్రతకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రతి ప్రాంతానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా అభివృద్ధి పనుల ప్రతిపాదనలను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో MMC ప్రాజెక్టు అధికారులు శ్రీనివాస్, రోహిణి, రేణుక, సుజిత్, మాజీ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అనిల్ కిషోర్ గౌడ్, మేకల రాము యాదవ్, కేబుల్ రమేష్, మోహన్ రెడ్డి, మా శెట్టి అనిల్, కిరణ్ ముదిరాజ్, లక్ష్మణ్ యాదవ్, లక్ష్మణ్ వజీర్, సురేష్ తదితరులు, వివిధ కాలనీల ప్రతినిధులు, పాల్గొన్నారు.

వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

- **కుంభం అనిల్ కుమార్ రెడ్డి.**

వలిగొండ అక్టోబర్ 30 : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని ఎదుల్లగూడెం,పొద్దటూరు, మాందాపురం, గ్రామాల్లో పిఎసిఎస్ ఆధ్వర్యంలో వలిగొండ మండల కేంద్రంలో ఎఫ్ బి ఓ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించేందుకు వచ్చిన రైతులతో మాట్లాడి, కొనుగోలు ప్రక్రియ, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర, కేంద్రాల్లో కల్పించిన సౌకర్యాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి పండించిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర అందించేలా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని సూచించారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతులకు సకాలంలో ధాన్యం విక్రయించే అవకాశం కల్పిస్తూ, కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడాలని తెలిపారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,వలిగొండ మండల కాంగ్రెస్ అధ్యక్షులు పట్టణ అధ్యక్షులు ,స్థానిక సర్పంచులు, పిఎసిఎస్ డైరెక్టర్లు,ఇతర నాయకులు, అధికారులు,రైతులు పాల్గొన్నారు.

ఆప్యాయతతో పలకరిస్తే..ఆత్మీయతతో ఆదరిస్తే..

- **అవసరార్థుల వద్దకే వెళ్లి సేవలందించాలి**
- **అనురాగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి**



హన్మకొండ, అక్టోబరు 30 : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందాలంటే వారి వద్దకే వెళ్లి అవగాహన కల్పించాలని అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. ఏసీ హాళ్లలో కూర్చొని కార్యక్రమాలు నిర్వహించడం కంటే అవసరార్థుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వారికి అండగా నిలవడం ముఖ్యమని పేర్కొన్నారు. హన్మకొండలోని వాజ్‌పేయి కాలనీ పరిధిలోని అంబేద్కర్‌నగర్ మురికివాడతోపాటు గుడిసెవాసుల ఇళ్లను గురువారం ఆమె సందర్శించారు. ఆయా కుటుంబాల్లోని పిల్లలు పాఠశాలలకు వెళుతున్నారా? ఎవరైనా మధ్యలోనే చదువు మానేశారా? 18 ఏళ్లలోపు బాల్యవివాహాలు జరుగుతున్నాయా? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యకు దూరమైతే కలిగే నష్టాలు, బాల్యవివాహాల వల్ల ఎదురయ్యే అనర్థాలను వారికి అర్థమయ్యే రీతిలో వివరించారు.ఒంటరి మహిళలకు అందించే సంక్షేమ పథకాలు, వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్లపై అవగాహన కల్పించారు. ? అనే వివరాలను తెలియజేశారు. శరీరాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.. అప్పుడే ప్రభుత్వ పథకాలు, చట్టాల ఉద్దేశం నెరవేరి వాటి ఫలాలు అర్హులకు చేరుతాయని తెలిపారు. అనంతరం నిరుపేద కుటుంబాలకు సేకరించిన దుస్తులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గుడిసెవాసులు పాల్గొన్నారు.

బాలల హక్కులకు చట్టమే రక్షణ కవచం

- వేధింపులపై భయపడకుండా గొంతెత్తాలి
- రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం. పద్మజ
- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ

వరంగల్, అక్టోబర్ 30 : :

బాలల హక్కుల పరిరక్షణకు చట్టాలు రక్షణ కవచంలా నిలుస్తాయని, విద్యార్థులు తమ హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని వరంగల్ రెండో అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి ఎం. పద్మజ అన్నారు. బాలలపై వేధింపులు, అన్యాయాలు జరిగినప్పుడు భయపడకుండా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. హనుమకొండలోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్, జూనియర్ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'బాల సురక్ష అభియాన్' చట్టపరమైన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాల్యం జీవితంలో అత్యంత కీలకమైన దశ అని, పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎదిగేందుకు సురక్షితమైన వాతావరణం అవసరమని పేర్కొన్నారు. బాలల రక్షణ కోసం పోక్సో వంటి చట్టాలు అమల్లో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు తమకు ఎదురయ్యే అన్యాయాలపై మౌనంగా ఉండకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సెల్‌ఫోన్ల వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు.

ఆపదలో 1098కు ఫోన్ చేయాలి..

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ, చట్టాలపై అవగాహన కల్పించడమే 'బాల సురక్ష అభియాన్' ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. బాలలు ఆపదలో ఉన్నప్పుడు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098ను సంప్రదించాలని సూచించారు. పాఠశాలల్లో లేదా నివాస ప్రాంతాల్లో వేధింపులు ఎదురైతే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని చెప్పారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి..

చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ ఆర్. సురేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో తెలియని వ్యక్తులతో పరిచయాలు, వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం ప్రమాదకరమని హెచ్చరించారు. క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్యను అలవర్చుకోవాలని, చదువుతోపాటు సామాజిక బాధ్యతను గుర్తించాలని పేర్కొన్నారు.

న్యాయమూర్తులతో ముఖాముఖి..

సదస్సులో విద్యార్థులు న్యాయమూర్తులతో ముఖాముఖిగా మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. చట్టాలు, బాలల హక్కులు, భద్రత, సైబర్ నేరాలపై అవగాహన పొందారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎన్. వెంకటేశ్వరరావు, జనరల్ మేనేజర్ అనుపమ, ప్రిన్సిపాల్ జై, పాఠశాల యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయులు, వివిధ విభాగాల అధిపతులు, వందలాది మంది పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల త్యాగాలకు రక్తదానంతో నివాళి

- అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో సేవా కార్యక్రమం.. డాక్టర్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి

నర్సంపేట, అక్టోబర్ 30 : :

దేశ రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నర్సంపేట పట్టణంలోని సిటిజన్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఆయన ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, యువకులు, సన్నిహితులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాణా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ సమాజ రక్షణ కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడే గొప్ప మానవతా కార్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల సేవలను కొనియాడుతూ వారికి ఘనంగా నివాళులర్పించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా సమాజంలో సేవాభావం, మానవతా విలువలు మరింత పెంపొందుతాయని ఆకాంక్షించారు.కార్యక్రమంలో పోలీసు శాఖ అధికారులు, బీజేపీ నాయకులు, యువకులు పాల్గొని రక్తదానం చేశారు.

ఓటు హక్కు కోసం ఢిల్లీ బాట.. నర్సంపేట కాంగ్రెస్ గళం!

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నాయకత్వంలో ఢిల్లీకి బయలుదేరిన పార్టీ నాయకులు, శ్రేణులు
- నవంబరు 1న రామ్‌లీలా మైదానంలో భారీ బహిరంగ సభ

నర్సంపేట, అక్టోబర్ 30 : :

ఓటు హక్కు పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కాపాడటమే లక్ష్యంగా నవంబరు 1న న్యూఢిల్లీలో నిర్వహించనున్న 'ఓటు చోరీకి వ్యతిరేకంగా భారీ బహిరంగ సభ'లో పాల్గొనేందుకు నర్సంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల బృందం శుక్రవారం ఢిల్లీకి బయలుదేరింది. అఖిల భారత కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే పిలుపు మేరకు ఈ పర్యటన చేపట్టారు.న్యూఢిల్లీలోని చారిత్రక రామ్‌లీలా మైదానంలో జరగనున్న సభలో ఓటు హక్కు పరిరక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు పాల్గొననున్నాయి. కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా నిర్వహించే ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరానున్నారు.ఈ సందర్భంగా నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు మాట్లాడుతూ నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నాయకత్వంలో నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఢిల్లీకి వెళ్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ ఉద్యమంలో భాగస్వాములవుతున్నామన్నారు.'ఓటు హక్కును కాపాడుకుందాం.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందాం' అనే నినాదంతో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పోరాటాన్ని కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టణ ఇన్‌ఛార్జిల నియామకం

- నర్సంపేట ఇన్‌ఛార్జిలుగా గోనె యువరాజు, రాయిడి దుష్యంతరెడ్డి

నర్సంపేట, అక్టోబర్ 30 :

త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నర్సంపేట పట్టణ ఇన్‌ఛార్జిలుగా గోనె యువరాజు, రాయిడి దుష్యంతరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్సీ, మండలి ప్రతిపక్ష ఉపనాయకుడు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌ఛార్జి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ప్రకటించారు.రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పట్టణ పరిధిలో ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. ముఖ్యంగా 2023లో డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులను గుర్తించి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లుగా నమోదు చేయించేందుకు కృషి చేయాలని తెలిపారు.పట్టణంలోని అర్హులైన పట్టభద్రుల వివరాలను సేకరించి, ఓటరు నమోదుపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓటు కీలకమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునే దిశగా ముందస్తు కార్యాచరణతో పనిచేయాలని నాయకత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో నర్సంపేట పట్టణంలో ఓటరు నమోదు ప్రక్రియను సమర్థంగా నిర్వహించడంలో నూతన ఇన్‌ఛార్జిలు కీలక పాత్ర పోషించనున్నారు.

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించొద్దు:
- జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ IPS
- నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ నిర్వహించిన జిల్లా ఎస్పీ
- ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి.

నారాయణపేట అక్టోబర్,30:

నేరాల నియంత్రణకు పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యం వహించకుండా బాధితులకు సత్వర న్యాయం అందించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS పోలీస్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం వార్షిక తనిఖీల్లో భాగంగా నారాయణపేట సర్కిల్ ఆఫీస్ ను మరియు టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS పోలీస్ అధికారులు స్వాగతం పలుకగా ముందుగా పోలీస్ పరేడ్ ను పరిశీలించి పలు సూచనలు చేశారు. స్టేషన్ పనితీరు, సిబ్బంది విధుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు వివరాలు, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. అనంతరం పోలీసు సిబంది కిట్ ఆర్టికల్స్ పరిశీలించి గవర్నమెంట్ నుండి ఇచ్చిన ప్రతి ఆర్టికల్స్ జాగ్రత్తగా ఉంచుకోవాలని తెలిపారు. అలాగే పోలీస్ స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ కౌంటర్, సీసీ కెమెరాల పనితీరు, రికార్డుల నిర్వహణను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, బాధితుల సమస్యలను ఓపికగా విని చట్టప్రకారం తక్షణమే స్పందించాలని సూచించారు. బాధితుల వద్దకు వెళ్లి ఆన్‌సైట్ ఎఫైర్ నమోదు చేయాలని సూచించారు. పోలీస్ శాఖపై ప్రజలకు నమ్మకం పెరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. సర్కిల్ పరిధిలోస్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, దర్యాప్తులో ఉన్న కేసులు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను సమీక్షించారు. కేసుల దర్యాప్తులో జాప్యం జరగకుండా శాస్త్రీయ పద్ధతుల్లో సాక్ష్యాధారాలు సేకరించి, నేరస్థులకు శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్ణీత గడువులో చార్జిషీట్లు దాఖలు చేస్తూ పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని, పాత నేరస్తులు, రౌడీషీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. పట్టణ పరిధిలో బీట్ వ్యవస్థను బలోపేతం చేస్తూ రాత్రి వేళల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, దొంగతనాలు, ఇతర నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, యువతను మాదక ద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, అనుమానాస్పద ఫోన్ కాల్స్ పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు.మహిళలు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళలపై జరిగే నేరాల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు అండగా నిలవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలపై విస్తృత అవగాహన కల్పించాలని, హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం, అతివేగాన్ని నియంత్రించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. సర్కిల్ లోని మరియుపోలీస్ స్టేషన్‌లోని క్రైమ్ రికార్డులు, కేసు డైరీలు, జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ రిజిస్టర్లు, కోర్టు కేసుల వివరాలను పరిశీలించి, అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని అధికారులకు సూచించారు. విధుల నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని స్పష్టం చేశారు. నేరాల నివారణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా ఫిర్యాదుల సత్వర పరిష్కారమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ ఆదేశించారు.ఈ వార్షిక తనిఖీలో డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ శివ శంకర్, ఎస్ఐ లు వెంకటేశ్వర్లు, గాయత్రి, KT మల్లేష్, బాలరాజు, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాధునిక భద్రతా ఫీచర్లతో గోద్రెజ్ స్మార్ట్ లాకర్లు

- హనుమకొండలో నూతన బ్రాంచ్ ప్రారంభం

హనుమకొండ, అక్టోబర్ 30 :

అత్యాధునిక భద్రతా సాంకేతికతతో రూపొందించిన గోద్రెజ్ స్మార్ట్ లాకర్లు అందుబాటులోకి వచ్చాయని విజయ ఎంటర్‌ప్రైజెస్ ప్రొప్రైటర్ వెల్కండి కనుకయ్య, శ్రీకాంత్ తెలిపారు. హనుమకొండ సుబేదారి ఫారెస్ట్ కార్యాలయం ఎదురుగా విజయ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో శుక్రవారం గోద్రెజ్ లాకర్ల నూతన బ్రాంచ్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోద్రెజ్ సంస్థ సెక్యూరిటీ సొల్యూషన్స్ విభాగంలో భాగంగా ఫేస్ రికగ్నిషన్ సాంకేతికతతో కూడిన స్మార్ట్ లాకర్లను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. బయోమెట్రిక్ యాక్సెస్, డిజిటల్ కీలు, టచ్ అలారం వంటి ఆధునిక భద్రతా సదుపాయాలు వీటిలో ఉన్నాయని వివరించారు. గృహాలతోపాటు హోటళ్లు, ఇతర వాణిజ్య సంస్థల అవసరాలకు అనుగుణంగా వీటిని వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.ప్రజలు నూతన బ్రాంచ్‌ను సందర్శించి, అందుబాటులో ఉన్న వివిధ రకాల లాకర్లు, వాటి భద్రతా ఫీచర్ల గురించి తెలుసుకోవాలని కోరారు.కార్యక్రమంలో వెల్కటి విజయ, స్రవంతి, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

చలో కొత్తగూడెం అక్టోబర్ 31 న

- 17వ ఆవిర్భావ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలి.
- ప్రజా ఫ్రంట్ వలిగొండ మండల అధ్యక్షుడు పిలుపు.

వలిగొండ అక్టోబర్ 30 :

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ తెలంగాణ ప్రజా ఫ్రంట్ 17 వ ఆవిర్భావసభను పురస్కరించుకొని కొత్తగూడెంలో నిర్వహించనున్న సభకు వలిగొండ మండలంలోని ప్రజాస్వామికవాదులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు మేధావులు మహిళలు ఉద్యమకారులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని ప్రజా ఫ్రంట్ వలిగొండ మండల అధ్యక్షుడు రాపోలు పవన్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూ, సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య హక్కుల సాధన కోసం ప్రజా ఫ్రంట్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. సంస్థ 17వ ఆవిర్భావ సభను విజయవంతం చేయడం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు.ఈ సభలో ప్రజా సమస్యలు,సామాజిక అసమానతలు,ప్రజలహక్కులు, భవిష్యత్ కార్యాచరణ వంటిఅంశాలపై చర్చించినట్లు తెలిపారు. వలిగొండ మండలం నుండి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన పత్రికా ప్రకటనలో కోరారు

దేవుడా.. వాన కురిసింది!

- ఇలాగే మరో నాలుగు రోజులు కొట్టాలని ప్రజల వేడుకోలు

మల్కాజిగిరి:

ఎల్‌నినో ప్రభావంతో ఈ వర్షాకాలంలో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. దీంతో రాష్ట్రంలోని రైతులతో పాటు సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో వేసిన పంటలు నీరు లేక చేతికి రాకుండా పోతున్నాయని అన్నదాతలు ఆవేదన చెందుతున్న తరుణంలో, తాజాగా కురిసిన వర్షాలు వారికి ఊరటనిచ్చాయి. రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు కొంత ఉపశమనంఒకవైపు భూగర్భ జలాలు అడుగంటడంతో ప్రభుత్వం, అధికారులు తలమునకలవుతున్న సమయంలో ఈ వానలు కొంత ఉపశమనం కలిగించాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.హైదరాబాద్‌లో తాగునీటి కటకటవర్షాలు లేకపోవడంతో హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమైంది.రానున్న నెలల్లో కరువు మరింత పెరిగే అవకాశం ఉందని, నీటిని పొదుపుగా వాడాలని అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.పులకరించిన పుడమిఎండిపోయిన భూములపై చినుకులు పడటంతో పుడమి పులకరించింది ఎండ వేడిమి, ఉక్కపోత మధ్య ఈ చినుకులు చల్లదనాన్ని ఇచ్చాయని పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.వానల కోసం పూజలుఈ వర్షాలు ఇలాగే మరో నాలుగు రోజులు కురవాలని ప్రజలు దేవుళ్లను ప్రార్థిస్తూ పూజలు చేస్తున్నారు. అలా కురిస్తే కరువు తీవ్రతను కొంతైనా తగ్గించవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు.

నర్సింగ్ విద్యకు విదేశాల్లో ఎంతో ప్రాధాన్య

ఖమ్మం/సత్తుపల్లి, అక్టోబర్ 30:

జర్మనీ వంటి దేశాల్లో నర్సింగ్‌కు అధిక డిమాండ్ ఉందని, విద్యార్థులకు జర్మన్ భాషలో శిక్షణ అందించేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.సత్తుపల్లి ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఆశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నర్సింగ్ విద్యార్థినులకు పుస్తకాలు, స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. సత్తుపల్లి నర్సింగ్ కళాశాలను సుమారు రూ.19 కోట్ల వ్యయంతో త్వరలో ప్రారంభిస్తామని, అవసరమైన ఫ్యాకల్టీని కూడా సమకూరుస్తామని చెప్పారు.నర్సింగ్ వృత్తికి ఎంతో ప్రాధాన్యత ఉందని, విద్యార్థులు నాణ్యమైన సేవలందించి కళాశాలకు, కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని మంత్రి సూచించారు.

మహంకాళి దేవాలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న

- మాద్రి పృథ్వీరాజ్

సంగారెడ్డి జిల్లా సమయం న్యూస్ అక్టోబర్ 30

పటాన్‌చెరువులో మహంకాళి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ మహంకాళి తల్లి వార్షికోత్సవ వేడుకల్లో మాద్రి పృథ్వీరాజ్ గారు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. గౌరవనీయులు ఎం. సపనాదేవ్ ముదిరాజ్ గారు మాజీ కార్పొరేటర్, ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి ఈ సందర్భంగా బంధుమిత్రులు, ప్రజలకు, భక్తులందరికీ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

చురకలు
శనివారం 31.10.2026

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, అక్టోబర్ 30

నర్సాపూర్ ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ శుక్రవారం సందర్శించి వైద్య సేవలు, సిబ్బంది హాజరు, వివిధ విభాగాల పనితీరును పరిశీలించారు.రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో అవసరమైన వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉంచాలని, సిబ్బంది సమయపాలనతో విధులకు హాజరై రోగులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ వంశీ, వైద్యులు, నర్సింగ్ అధికారులు, ల్యాబ్ టెక్నీషియన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం

- సహించేది లేదు – కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల/పెగడపల్లి, అక్టోబర్ 30(సమాసం న్యూస్):

జాబ్ కార్డుదారులందరికీ నిరంతర ఉపాధి కల్పించి, గ్రామాల్లో శాశ్వత ఆస్తుల సృష్టికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు.సోక్‌పిట్స్, ఫామ్‌పాండ్స్, నర్సరీలు, మొక్కల పెంపకం వంటి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. వెనుకబడిన గ్రామాల్లో పనుల పురోగతిని వేగవంతం చేయాలని, నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వచ్చే మార్చి నాటికి గ్రామపంచాయతీల్లో 100 శాతం పన్నుల వసూళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా సాధించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

వ్యవసాయ రంగంలో డిజిటల్ సేవలను విస్తృతం

- చేయాలి: కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల, అక్టోబర్ 30 :

రైతులకు ప్రభుత్వ పథకాలు, సేవలను సులభంగా అందించేందుకు అగ్రిస్టాక్ డిజిటల్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు.నస్పూర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో అగ్రిస్టాక్ అమలుపై సమీక్షించారు. జిల్లాలో రైతు ఐడీల నమోదులో 70.4 శాతం, డిజిటల్ క్రాప్ సర్వేలో 88.63 శాతం పురోగతి సాధించినట్లు తెలిపారు. అగ్రిస్టాక్ ద్వారా ఎరువులు, విత్తనాలు, పంటల కొనుగోళ్లు, బీమా, వ్యవసాయ రుణాలు, పీఎం కిసాన్ తదితర సేవలను పారదర్శకంగా అందించవచ్చని పేర్కొన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందేలా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

2027 ఏప్రిల్‌లో న్యూఢిల్లీలో CGIAR–ICAR సైన్స్ వీక్

న్యూఢిల్లీ, అక్టోబర్ 30

CGIAR-ICAR సైన్స్ అండ్ పార్ట్‌నర్షిప్ వీక్ 2027ను ఏప్రిల్ 12-17 వరకు న్యూఢిల్లీలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రపంచవ్యాప్తంగా 5,000 మందికి పైగా ప్రతినిధులు హాజరు కానున్నారు. భారత్ వ్యవసాయ రంగంలో సాధించిన శాస్త్ర, సాంకేతిక పురోగతి, వాతావరణ అనుకూల వ్యవసాయం, డిజిటల్ అగ్రికల్చర్, చిరుధాన్యాలు, ప్రకృతి వ్యవసాయం, సుస్థిర వ్యవసాయ పద్ధతులను ఈ కార్యక్రమంలో ప్రదర్శించనున్నారు. ప్రపంచ దేశాలతో వ్యవసాయ ఆవిష్కరణలు, పరిశోధనలను పంచుకోవడమే ప్రధాన లక్ష్యమని ICAR డీజీ డా. ఎం.ఎల్. జాట్ తెలిపారు.

PM-KISAN 24వ విడత విడుదల

హైదరాబాద్, అక్టోబర్ 30

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నరేంద్ర మోదీ PMKISAN 24వ విడతను విడుదల చేశారు. హైదరాబాద్‌లోని ICARNAARMలో 107 మంది రైతులు, సిబ్బంది ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు.ప్రధాని మట్టి సారాన్ని కాపాడుతూ, వాతావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులను అవలంబించి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రగతిశీల రైతులను సత్కరించడంతో పాటు నర్సరీ నిర్వహణ, వ్యవసాయ డ్రోన్ సాంకేతికతపై ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించారు.

చేవెళ్ల, అక్టోబర్ 30 ::

చేవెళ్ల మండలంలోని దామరిద్ద గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న ఓ కంపెనీ సమీపంలో మిషన్ భగీరథ పైప్ లైన్ నుంచి నీరు పెద్దఎత్తున వృధాగా పోతోంది. అయినప్పటికీ సంబంధిత మిషన్ భగీరథ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రజలకు తాగునీరు అందించాల్సిన నీరు ఇలా రోడ్లపై వృధాగా పోతుండటంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి, నీటి లీకేజీని వెంటనే అరికట్టి పైప్ లైన్ కు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజాధనం, తాగునీరు వృధా కాకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రైతుల దినోత్సవం, పీఎం-కిసాన్ ఉత్సవ్ దివస్

- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులే లక్ష్యం: బండి సంజయ్

హైదరాబాద్, అక్టోబర్ 30

రాజేంద్రనగర్‌లోని ICAR-IIRRలో రైతుల దినోత్సవం, పీఎంకిసాన్ ఉత్సవ్ దివస్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు అందించేలా వినూత్న పరిశోధనలు, ఆధునిక సాగు పద్ధతులు అభివృద్ధి చేయాలని శాస్త్రవేత్తలను కోరారు. రైతులు ICAR-IIRR శాస్త్రవేత్తల సూచనలు పాటించి శాస్త్రీయ పద్ధతులతో సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కొత్త వరి వంగడాలు, పురుగుమందుల వినియోగంపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. సుమారు 200 మంది రైతులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ఫామ్‌హౌస్ పార్టీపై

- ఎస్ఓటీ పోలీసుల మెరుపు దాడి

చేవెళ్ల, అక్టోబర్ 30: :

చేవెళ్ల పరిధిలోని కమ్మెట గ్రామ సమీపంలోని ఎల్జీ ఫామ్‌హౌస్‌లో నిర్వహిస్తున్న పార్టీపై ఎస్ఓటీ, స్థానిక చేవెళ్ల పోలీసులు మెరుపు దాడి చేశారు.ఐబీఎస్ ఇఫ్కాయ్ యూనివర్సిటీకి చెందిన బీబీఏ, ఇంజినీరింగ్ విభాగాల విద్యార్థులు ఈ పార్టీలో పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు.ఫామ్‌హౌస్‌లో పార్టీ జరుగుతున్న సమయంలో పోలీసులు దాడి చేయడంతో పార్టీ భగ్నమైంది. పార్టీలో సుమారు 20 నుంచి 25 మంది విద్యార్థులు, విద్యార్థినులు ఉన్నట్లు సమాచారం. పోలీసులను చూడగానే విద్యార్థులు పరుగులు తీయడానికి ప్రయత్నించగా, పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని చేవెళ్ల పోలీస్ స్టేషన్ కు తరలించారు.పార్టీలో ఉన్న విద్యార్థులకు పోలీసులు డ్రగ్ టెస్ట్ నిర్వహిస్తున్నారు. ఘటనా స్థలంలో భారీగా మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా నిర్వహించిన షార్ట్ ఫిల్మ్ పోటీల విజేతలకు

- ప్రశంసా పత్రాల అందజేత

వికారాబాద్, అక్టోబర్,30:

పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా నిర్వహించిన షార్ట్ ఫిల్మ్ పోటీలలో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఐఏఎస్, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ పోటీలలో ప్రథమ బహుమతిని యాలాల్ పోలీస్ స్టేషన్ ఎస్సై విఠల్ రెడ్డి, ద్వితీయ బహుమతిని పెద్దేముల్ పోలీస్ స్టేషన్ ఎస్సై ప్రశాంత్ వర్ధన్, తృతీయ బహుమతిని నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్ ఎస్సై గిరి సాధించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పోలీస్ ఫ్లాగ్ డే పోలీస్ శాఖ త్యాగాలను, సేవలను, ప్రజల పట్ల పోలీసుల బాధ్యతను గుర్తుచేసే ముఖ్యమైన సందర్భమని పేర్కొన్నారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసాన్ని పెంపొందించేందుకు, సామాజిక సమస్యలపై అవగాహన కల్పించేందుకు షార్ట్ ఫిల్మ్స్ వంటి సృజనాత్మక మాధ్యమాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలు పోలీసుల సేవాభావం, క్రమశిక్షణ, అంకితభావాన్ని ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. ప్రజలకు చేరువయ్యేలా, నేరాల నివారణ, మహిళలు మరియు బాలల భద్రత, రోడ్డు భద్రత వంటి అంశాలపై అవగాహన కల్పించే విధంగా మరిన్ని సృజనాత్మక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా, ట్రైనీ కలెక్టర్ సచిన్ బసవరాజ్ గుత్తూర్, ఆర్ అండ్ బీ ఈఈ శ్రీధర్ రెడ్డి, ఈఈ (పీఆర్) ఉమేష్ కుమార్, డీపీవో జయసుధ, వైద్య అధికారి చంద్రశేఖర్, డీఎస్పీలు, సీఐలు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వానలోనూ వీడని జనం.. డంపింగ్ యార్డ్ తొలగించే వరకు పోరాటం

- ఆగదన్న ఈటల
- బాలాజీనగర్‌లో జన సంకల్ప యాత్ర ముగింపు సభ.. కుర్చీలనే గొడుగులుగా చేసుకుని ప్రసంగాలు విన్న బాధితులు

జవహర్‌నగర్ అక్టోబర్ 30, 2026

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై నాలుగు రోజులు సాగిన 'జన సంకల్ప యాత్ర' బాలాజీనగర్‌లో జరిగిన ముగింపు సభతో ముగిసింది. సభ సమయంలో భారీ వర్షం కురిసినా జనం కదలలేదు. కుర్చీలను తలపై పెట్టుకుని వానలో తడుస్తూనే ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్ రావు ప్రసంగాలను చివరి వరకు విన్నారు. ఈ దృశ్యం సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.వర్షం మొదలైతే బహిరంగ సభల నుంచి జనం వెళ్లిపోవడం సాధారణం. కానీ ఇక్కడ అందుకు భిన్నంగా కనిపించింది. ఏళ్లుగా డంపింగ్ యార్డ్ వల్ల ఇబ్బందులు పడుతున్న బాధితులు, స్థానికులు చివరి వరకు సభలోనే నిలిచారు. ఇది కేవలం రాజకీయ సభకు హాజరైన జనసందోహం కాదని, తమ ప్రాంత సమస్యకు పరిష్కారం కావాలన్న ప్రజల పట్టుదలకు నిదర్శనమని పలువురు వ్యాఖ్యానించారు.మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నేతృత్వంలో జరిగిన ఈ పాదయాత్రకు నాలుగు రోజులూ డంపింగ్ యార్డ్ బాధితులు, స్థానికులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అండగా నిలిచారు. ముగింపు సభలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, రాకేష్ రెడ్డి, ఎమ్మెల్సీలు, జిల్లా నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సభలో కొనసాగిన ప్రజల నిబద్ధత తమ బాధ్యతను మరింత పెంచిందని నాయకులు అన్నారు. ప్రభుత్వానికి ప్రశ్నలుఈ సభతో డంపింగ్ యార్డ్ సమస్యపై ప్రజల అసంతృప్తి, ఆందోళన మరోసారి బయటపడ్డాయి. అనే ప్రశ్నలు మళ్లీ చర్చకు వచ్చాయి.సభలో మాట్లాడిన ఈటల రాజేందర్, వాన వచ్చినా ఎండ వచ్చినా డంపింగ్ యార్డ్ తొలగించే వరకు పోరాటం ఆగదని ప్రకటించారు. ఈ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, బాధితులకు న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు.యాత్ర ముగిసినా పోరాటం కొనసాగుతుందని నాయకులు తేల్చిచెప్పారు. ప్రసంగాలు ముగిసినా వర్షంలో నిలబడిన ప్రజల సంకల్పం ఆ మాటకు బలం చేకూర్చింది.

ఇన్ఫోసిస్ విస్తరణతో హైదరాబాద్‌పై అంతర్జాతీయ సంస్థల విశ్వాసం

- మరింత బలోపేతం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మల్కాజిగిరి అక్టోబర్ 30(సమయం న్యూస్)

హైదరాబాద్‌ను పెట్టుబడులకు, ప్రజల జీవన ప్రమాణాలకు అనువైన ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ సమీపంలోని పోచారం ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో నూతన కార్యాలయ భవనాన్ని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఇన్ఫోసిస్ విస్తరణ హైదరాబాద్‌పై అంతర్జాతీయ సంస్థల విశ్వాసానికి నిదర్శనమన్నారు.హైదరాబాద్‌లో ఇన్ఫోసిస్ ఇప్పటికే 48 వేల మందికి పైగా ఉద్యోగులతో కార్యకలాపాలు నిర్వహిస్తోందని, తాజాగా 10 లక్షల చదరపు అడుగులకు పైగా విస్తీర్ణంలో నూతన భవనాన్ని అందుబాటులోకి తీసుకురావడం రాష్ట్ర ఐటీ రంగ అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.ఏఐతో సాంకేతిక రంగంలో కొత్త అవకాశాలు వస్తున్న నేపథ్యంలో యువతకు నైపుణ్య శిక్షణ, ప్రాక్టికల్ అనుభవం, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని భట్టి విక్రమార్క సూచించారు. పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య భాగస్వామ్యాన్ని పెంచడంతో పాటు జిల్లాల కళాశాలల విద్యార్థులకు ఐటీ రంగంలో సమాన అవకాశాలు కల్పించాలని ఇన్ఫోసిస్‌ను కోరారు.కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు తోటకూర వజ్రేష్ యాదవ్, జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, పోలీసు అధికారులు తదితరులు హాజరయ్యారు.

ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ తనిఖీ

- అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పటిష్ట నిఘా: ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్, అక్టోబర్ 30

వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు, కేసు ఫైళ్లు, పెండింగ్ కేసులను పరిశీలించారు.పట్టణంలో గంజాయి, మట్కా, డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పాటు ఇతర అసాంఘిక కార్యకలాపాలపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పెండింగ్ కేసులను వేగంగా దర్యాప్తు చేసి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరించి, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. విధుల్లో క్రమశిక్షణ, నిజాయితీ పాటించాలని ఎస్పీ ఆదేశించారు.తనిఖీలో డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ బి. సునీల్ కుమార్, ఎస్సైలు నాగనాథ్, అశోక్, సంజయ్, హారూన్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేద ఆదివాసీలకు ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

ఆదిలాబాద్, అక్టోబర్ 30 :

ఆదిలాబాద్ జిల్లాలోని మారుమూల ఆదివాసీ గ్రామాలైన అంబుగాం, గిరిగామ, అత్నం గూడ, లింగు గూడ గ్రామాల్లో ఈ నెల 26న నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో కంటి సమస్యలతో బాధపడుతున్న 16 మందిని శస్త్ర చికిత్సలకు గుర్తించారు.జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐపీఎస్ చొరవతో తొలి విడతలో ముగ్గురికి ఆదిలాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించి, మందులు అందించారు. గ్రామాల నుంచి ఆసుపత్రికి ఉచిత రవాణా సౌకర్యం కూడా కల్పించారు.శస్త్ర చికిత్సలు పొందిన దుర్వ బుజంగరావు (67), పర్దాన్ రామారావు (62), తొడసం తులసిరామ్ (55)తో పాటు గ్రామ ప్రజలు ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు శ్రేయ, సిమ్రాన్, అఫ్రిద్, అనిషా, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ టి. రంజిత్ కుమార్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కరీంనగర్ జిల్లాలో విజయవంతంగా ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం

- విద్యార్థుల హాజరులో పెరుగుదల – ఈ నెలాఖరులోగా అన్ని మండలాలకు విస్తరణ

కరీంనగర్, అక్టోబర్ 30

తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న అల్పాహార పథకం కరీంనగర్ జిల్లాలో విజయవంతంగా కొనసాగుతోంది. సెప్టెంబర్ 16న ప్రారంభమైన ఈ పథకం ప్రస్తుతం ఏడు మండలాల్లోని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, మోడల్ పాఠశాలల్లో అమలవుతోంది. ఏఎంసీ ప్రాంగణంలోని కేంద్రీకృత వంటశాల ద్వారా హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో అల్పాహారం తయారు చేసి పాఠశాలలకు పంపిణీ చేస్తున్నారు. పథకం అమలుతో విద్యార్థుల హాజరు శాతంలో మెరుగుదల కనిపిస్తుండగా, ఉదయం అల్పాహారం అందడంతో విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు హాజరవుతూ, చదువుపై ఏకాగ్రత పెంచుకుంటున్నారు.వచ్చే సోమవారం నుంచి తిమ్మాపూర్ మండలంలో కూడా అల్పాహార పంపిణీ ప్రారంభించనున్నారు. ఈ నెలాఖరులోగా జిల్లాలోని అన్ని మండలాలకు పథకాన్ని విస్తరించేందుకు జిల్లా విద్యాశాఖ చర్యలు చేపడుతోంది.విద్యార్థుల పోషకాహారం, క్రమబద్ధమైన హాజరు, డ్రాప్‌అవుట్ల తగ్గింపు, విద్యా ప్రమాణాల మెరుగుదల లక్ష్యంగా అధికారులు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పనిచేస్తున్నారు.

విద్యార్థుల భోజనంలో నిర్లక్ష్యమా? సహించేది లేదు!

- గుండాల ఏకలవ్య పాఠశాలలో కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీ
- కుళ్లిన కూరగాయలు, పంచదారలో చీమలు.. వంట మనిషిని తొలగించాలని ఆదేశం
- ప్రిన్సిపాల్‌కు మెమో జారీ చేయాలని ఆదేశాలు
- వైద్యం, భూ రీ సర్వే పనులపైనా క్షేత్రస్థాయి పరిశీలన

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 30 :

విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. గుండాల మండలంలో శుక్రవారం విస్తృతంగా పర్యటించిన ఆయన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడి పరిస్థితులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో గుర్తించిన లోపాలపై ప్రిన్సిపాల్‌కు మెమో జారీ చేయాలని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన వంట మనిషిని విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు.

కుళ్లిన కూరగాయలు.. భోజన నాణ్యతపై ఆగ్రహం!

ఏకలవ్య పాఠశాలలో తరగతి గదులను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులు లేకపోవడంపై ప్రశ్నించారు. పాఠాలు చెప్పాల్సిన సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంపై అసహనం వ్యక్తం చేశారు. విద్యాభ్యాసానికే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, సాంస్కృతిక కార్యక్రమాలను సెలవు రోజుల్లో నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. పాఠశాల మరుగుదొడ్ల అపరిశుభ్రతపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్ వంటశాల, నిల్వ గదులను పరిశీలించారు. అక్కడ బంగాళాదుంపలు కుళ్లిపోయి ఉండటం, పంచదారలో చీమలు పట్టి ఉండటాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు వడ్డిస్తున్న సాంబార్, రసం పలుచగా ఉండటాన్ని ప్రశ్నించారు. ఆరోజు ప్రభుత్వ మెనూ ప్రకారం బిర్యానీ వడ్డించాల్సి ఉండగా, అందుకు అనుగుణంగా భోజనం సిద్ధం చేయకపోవడంపై నిలదీశారు. ప్రభుత్వ మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని, విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని స్పష్టం చేశారు. పాఠశాలలో విద్యాబోధన, విద్యార్థుల హాజరు, పారిశుద్ధ్యం, భోజన నాణ్యత, ఆహార పదార్థాల నిల్వలో గుర్తించిన లోపాలపై ప్రిన్సిపాల్‌కు మెమో జారీ చేయాలని ఆదేశించారు.

మారుమూల ప్రాంతాల్లో మెరుగైన వైద్యం అందించాలి!

అనంతరం గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ వైద్య సేవలు, రక్త పరీక్షలు, మందుల నిల్వలు, వైద్య పరికరాల లభ్యతను పరిశీలించారు. అత్యవసర వైద్య అవసరాలకు ఉపయోగించే సిరంజీలు అందుబాటులో లేకపోవడంపై వైద్యాధికారులను ప్రశ్నించారు. అవసరమైన మందులు, సిరంజీలు, వైద్య పరికరాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి సమయపాలన పాటించాలని సూచించారు. ఇన్‌పేషెంట్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్యం, మందులు, భోజన సదుపాయాల గురించి తెలుసుకున్నారు. మారుమూల ప్రాంత ప్రజలకు సైతం నాణ్యమైన వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు.

భూ రీ సర్వే వేగవంతం చేయాలి!

గుండాల రెవెన్యూ పరిధిలో జరుగుతున్న భూ రీ సర్వే పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. మొత్తం 10,390 ఎకరాల్లో 6,694 ఎకరాలు అటవీ భూములుగా ఉన్నాయని, మిగిలిన భూముల్లో సర్వే కొనసాగుతోందని అధికారులు వివరించారు. ఇప్పటివరకు సుమారు 950 ఎకరాల్లో సర్వే పూర్తికాగా, అందులో 561 ఎకరాల్లో ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించినట్లు తెలిపారు. రైతుల సమక్షంలోనే భూముల హద్దులు నిర్ధారించాలని, వారి పేర్లు, సంతకాలు, ఆధార్, మొబైల్ వివరాలను నమోదు చేయాలని సూచించారు. పట్టాదారు పాస్ పుస్తకాలు, పహాణీ వివరాలతో పాటు ప్రస్తుతం సాగు చేస్తున్న రైతుల వివరాలను కూడా నమోదు చేయాలన్నారు. అటవీ, అసైన్డ్, రెవెన్యూ భూముల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి రైతుల అభ్యంతరాలను పరిష్కరించాలని ఆదేశించారు. నవంబర్ 15వ తేదీలోగా భూ రీ సర్వే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డీజీపీఎస్ పరికరాల పనితీరును పరిశీలించారు. ఈ పర్యటనలో సర్పంచ్ రాధా, తహసీల్దార్ సంగీత, ఎంపీడీవో బాలరాజు, ఎంఈఓ పార్వతి, ఎంపీవో త్రిలోక్, సర్వేయర్ శివకృష్ణ, వైద్యులు, వైద్య సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం!

- పోలీస్ అమరవీరుల సంస్మరణలో మెగా రక్తదాన శిబిరం
- స్వచ్ఛందంగా ముందుకొచ్చిన యువత, విద్యార్థులు
- రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేసిన ఎస్పీ రోహిత్ రాజు

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 30 :

పోలీస్ అమరవీరుల సంస్మరణోత్సవాల్లో భాగంగా శుక్రవారం కొత్తగూడెం క్లబ్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి సేవలను ప్రజలకు తెలియజేసేందుకు జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సైకిల్ ర్యాలీ, ద్విచక్ర వాహన ర్యాలీ, వ్యాసరచన పోటీలు, పోలీస్ ఓపెన్ హౌస్‌తో పాటు అన్ని పోలీస్ సబ్ డివిజన్ల పరిధిలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

రక్తదానం.. మరొకరికి పునర్జన్మ!

అత్యవసర సమయాల్లో రక్తం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, రక్తదానం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడవచ్చని ఎస్పీ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం సమాజానికి అందించే గొప్ప సేవ అని తెలిపారు. ఈ శిబిరంలో విద్యార్థులు, యువకులు, మహిళలు, రాజకీయ ప్రముఖులు, పోలీస్ అధికారులు, సిబ్బంది, దివ్యాంగులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. రక్తదాతలను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం వారికి పండ్లు, పండ్ల రసాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ తుకారం నాయక్, డీఎస్పీలు ఆదినారాయణ, మల్లయ్య స్వామి, సత్యనారాయణ, సీఐలు వెంకటేశ్వర్లు, శ్రీలక్ష్మి, జితేందర్, యాసిన్, ఇంద్రసేనారెడ్డి, కరుణాకర్, నరేష్, ఆర్ఐలు రవి, లాల్‌బాబు, కృష్ణారావు, పోలీస్ అధికారులు, సిబ్బంది, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానానికి మరో రూపం!

- ఇల్లందులో పోలీసుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం
- తలసేమియా చిన్నారుల కోసం రక్తం సేకరణ
- రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేత

ఇల్లందు, అక్టోబర్ 30 :

పోలీస్ అమరవీరుల సంస్మరణోత్సవాల్లో భాగంగా ఇల్లందు సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం ఇల్లందులోని రాజస్థాన్ సేవా ట్రస్ట్ ఫంక్షన్ హాల్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇల్లందు సింగరేణి జనరల్ మేనేజర్ వీసం కృష్ణయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇల్లందు డీఎస్పీ వెంకన్నబాబు మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సమాజ సేవలో భాగంగా ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

తలసేమియా చిన్నారులకు రక్తమే జీవనాధారం!

తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు తరచూ రక్తం అవసరమవుతుందని, వారి ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం ఎంతో కీలకమని డీఎస్పీ పేర్కొన్నారు. ఈ శిబిరంలో సేకరించిన రక్తాన్ని తలసేమియా బాధితుల అవసరాల కోసం సంకల్ప సేవా సమితికి అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ శిబిరంలో యువకులు, విద్యార్థులు, పోలీస్ అధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. రక్తదాతలను అధికారులు అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐలు సురేష్, సత్యనారాయణ, తిరుపతి, పోలీస్ అధికారులు, సిబ్బంది, యువకులు, విద్యార్థులు, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో చదువు.. చిన్నారులకు కొత్త వెలుగు!

- పట్వారిగూడెం పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతి గది ప్రారంభం
- ఆట వస్తువులు, ఆకర్షణీయ బోధనా సామగ్రి ఏర్పాటు
- ప్రారంభించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

అశ్వారావుపేట, అక్టోబర్ 30 :

చిన్నారుల్లో చదువుపై ఆసక్తి పెంచి, ఆటపాటలతో విద్యాబోధన అందించేందుకు పట్వారిగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రీ ప్రైమరీ తరగతి గదిని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శుక్రవారం ప్రారంభించారు. చిన్నారుల వయసుకు తగినట్లుగా విద్యను సులభంగా అర్థం చేసుకునేలా వివిధ రకాల ఆట వస్తువులు, ఆకర్షణీయమైన బోధనా సామగ్రిని తరగతి గదిలో ఏర్పాటు చేశారు. ఆటపాటల ద్వారా విద్యను నేర్చుకోవడం వల్ల పిల్లల్లో చదువుపై మక్కువ పెరగడంతో పాటు ఆలోచనా శక్తి, సృజనాత్మకత అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోనూ చిన్నారులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ఇలాంటి ఏర్పాట్లు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంచి, ఉన్నత లక్ష్యాల సాధనకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుతో పాటు అవసరమైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కూరం అర్జున్ రావు, మండల విద్యాశాఖ అధికారి జగపతి రావు, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, ఉపసర్పంచ్ బొల్లికొండ నాగేశ్వరరావు, వాసం శ్రీనివాసరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డిమల్ల వెంకటేశ్వరరావు, కోటగిరి యుగేంద్రరావు, చెలికాని ప్రసాద్, వాసం వేణు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు ఉచిత అవకాశం

- జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రత్యేక నమోదు కార్యక్రమం ప్రారంభం
- అర్హులైన పట్టభద్రులు సద్వినియోగం చేసుకోవాలి: పసుపులేటి వీరబాబు

భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్ 30 :

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను ఉచితంగా ప్రారంభించినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు తెలిపారు.ఆయన ఆధ్వర్యంలో నూతన గ్రంథాలయ భవనంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈ ఉచిత నమోదు ప్రక్రియ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రేడ్–2 గ్రంథపాలకురాలు ఎస్. లలిత కుమారి, జి. మణి మృదుల, కంప్యూటర్ ఆపరేటర్ విజయ్, విద్యార్థినీ విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

చదువుల ప్రతిభకు ఎమ్మెల్యే ప్రశంసలు..!

- సరోజినాపురం పాఠశాలలో జారె ఆకస్మిక తనిఖీ
- విద్యార్థులతో ముచ్చటించి చదువు స్థాయిపై ఆరా
- ఉపాధ్యాయుల బోధనా తీరుపై అభినందనలు

దమ్మపేట, అక్టోబర్ 30 :

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందా? వారి చదువు స్థాయి ఎలా ఉందనే అంశాలను తెలుసుకునేందుకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శుక్రవారం దమ్మపేట మండలం సరోజినాపురం గ్రామంలోని ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడిన ఎమ్మెల్యే వారి చదువు స్థాయిని పరిశీలించారు. బోర్డుపై పదాలు రాయించి, పుస్తకాల్లోని పాఠాలను చదివించి వారి ప్రతిభను తెలుసుకున్నారు. విద్యార్థులు చక్కగా చదువుతూ మంచి ప్రతిభ కనబరచడంతో వారిని అభినందించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ వారి ప్రతిభను వెలికితీస్తున్న ఉపాధ్యాయులను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో నిరంతరం విద్యార్థులపై శ్రద్ధ చూపించాలని, వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు అంకితభావంతో కృషి చేయాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకునేలా ప్రోత్సహించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



కళ్లలో ఇన్ని రంగులా..!

కళ్ల రంగు బట్టి మీరెలాంటి వారో తెలుసుకోండి ఇలా

సర్వేంద్రియాణం.. నయనం ప్రధానం అన్నారు పెద్దలు. అంటే మానవుడికి ఉండే అన్ని ఇంద్రియాల్లోకి కళ్లు చాలా ముఖ్యమైనవి. మానవ శరీరంలో అత్యంత సున్నితమైనవి నేత్రాలు. మనుషుల మధ్య ప్రేమానుబంధాలు కళ్లతో మొదలై హృదయాన్ని చేరుకుంటాయని అంటుంటారు. మనిషికి ప్రపంచాన్ని చూపే ఈ కళ్లు ఎంతో ముఖ్యమైనవి. అంతేనా మనలో ఆకర్షణీయంగా కనిపించే అవయవాల్లో కళ్లు మొదటి స్థానంలో ఉంటాయి. అయితే ప్రపంచంలో కేవలం నలుపు రంగు, నీలికళ్లే కాదు ఇంకా చాలా రంగుల కళ్లు ఉన్నాయి..! అవేంటో తెలుసుకుందాం.

బూడిదరంగు కళ్లు

సాధారణంగా అందరికీ పుట్టినప్పుడు కళ్లు బూడిదరంగులో ఉంటాయి. కానీ పెరిగే కొద్దీ అవి రంగు మారతాయి. కానీ కొందరికి మాత్రం పెద్దయిన తర్వాత కూడా కళ్లు అదే బూడిదరంగులో ఉంటాయి. ఈ బూడిదరంగు కళ్లు ప్రపంచంలో 3 శాతం మందికి ఉంటాయి. కనుపాప రంగుకు కారణమయ్యే మెలనిన్ అనే వర్ణద్రవ్యం తక్కువ మొత్తం ఉండటం, కంటిలోని స్ట్రోమా భాగంలో కొలాజిన్ ప్రొటీన్ ఎక్కువగా ఉండటంతో కనుపాప నీలిరంగులోకి మారకుండా అడ్డంకి ఏర్పడుతుందట. ఫలితంగా కనుపాప బూడిద రంగులో కనిపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ రంగు కళ్లున్నవాళ్లు ఎక్కువగా ఉత్తర, తూర్పు యూరప్‌లో ఉంటారు. అయితే బూడిద రంగు కళ్లు గల వారిలో హుందాతనం మూర్తీభవించి ఉంటుంది. ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తుంటారు. చేయాలనుకున్నదాన్ని చేసుకుంటూ వెళ్లిపోయే రకం. ప్రేమ, రొమాన్స్ తదితరాలకు ఎక్కువ విలువనిస్తారు. మానసికంగా బలంగా ఉంటూ, పరిస్థితులను విశ్లేషించి కష్టకాలం నుంచి నెట్టుకు వచ్చేస్తారు.



నీలం రంగు కళ్లు

ప్రపంచంలో 8 నుంచి 10 శాతం మందికి నీలిరంగు కళ్లు ఉంటాయి. యూరప్‌లో అందులోనూ ముఖ్యంగా స్కాండినేవియాలో వీళ్లు అధికం. వీరి కనుపాప రంగు పాక్షికంగా తల్లిదండ్రుల జన్యువు నుంచి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. నీలిరంగు కళ్లున్న వ్యక్తులు చీకటిలోనూ చూడగలరట. అయితే పగటి పూట సూర్యకాంతిని తట్టుకోలేరని నిపుణులు చెబుతున్నారు. అయితే.. నీలి రంగు కళ్లు గల వారు శాంత స్వభావులుగా ఉంటారు. చాలా స్మార్ట్‌గా ఉంటూ ఇతరులను ఆకర్షిస్తారు. వారు దీర్ఘకాల బంధాన్ని కొనసాగిస్తారని నిపుణులు చెబుతున్నారు.

నలుపు రంగు కళ్లు

ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మంది కనుపాపలు నలుపు రంగులో ఉంటాయి. నిజానికి అది నలుపు కాదు.. గోధుమ రంగు. మెలనిన్ అనే వర్ణద్రవ్యం ఎక్కువగా ఉన్నవాళ్ల కళ్లు నలుపుగా కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. అయితే నల్ల రంగు కళ్లు రహస్యాన్ని సూచిస్తాయని నిపుణులు అంటున్నారు. వీరిది కష్టపడి పని చేసే తత్త్వం. బాధ్యతాయుతంగా ఉండటమే కాదు.. పని ఎంత కష్టమైనా.. చేయడంలో ఒక అడుగు ముందుంటారు. భవిష్యత్తు గురించి ఆలోచించకుండా ప్రెజెంట్‌లో జీవించే వ్యక్తిత్వం వీరిది.

లేత ఆకుపచ్చ కళ్లు

ప్రపంచ జనాభాలో 2శాతం మంది కళ్లు ఆకుపచ్చ రంగులో ఉంటాయంటా. ఉత్తర, మధ్య, పశ్చిమ యూరప్‌లో ఆకుపచ్చ కళ్లు ఉన్న వ్యక్తులు ఎక్కువ. వీరిలో 16 శాతం సెల్టిక్, జర్మన్ల వారసులై ఉంటారని అంచనా. ఐర్లాండ్, స్కాట్లాండ్‌లో 86 శాతం మంది నీలి, ఆకుపచ్చ రంగు కళ్లున్నవారు ఉన్నారు. ఈ వ్యక్తులు ఇతరులకన్నా ఆకర్షణీయంగా కనిపిస్తారు. అందంలోనే కాదు మేధస్సులోనూ వీరిని ఎవ్వరూ ఓడించలేరు. తమ తెలివితేటలతో ఇతరుల మెప్పు పొందుతారు.

బంగారు బల్లి విశిష్టత ఇదే..

బంగారు బల్లి అంటే ఎవరికైనా ఇట్టే గుర్తొచ్చేది తమిళనాడులోని కంచి కామాక్షి అమ్మవారి ఆలయం. అక్కడి ఆలయంలో బంగారు తొడుగులతో ఏర్పాటు చేసిన బల్లిని ముట్టుకుంటే దోషం పోయి ఫలితం లభిస్తుందని భక్తుల నమ్మకం. ఈ విషయం తరచుగా పెద్దలు కూడా చెబుతూ ఉంటారు. అయితే ఈ బంగారు బల్లి గురించి ఒక పురాణగాథ ఉంది. అదేమిటో తెలుసుకుందాం. దీనికి సంబంధించిన పురాణగాథ ప్రకారం.. గౌతమ మహర్షి వద్ద ఇద్దరు శిష్యులు ఉండేవారు. నదీ తీరానికి వెళ్లి నీటిని తీసుకువచ్చే సమయంలో కుండలో బల్లి పడిన విషయాన్ని గుర్తించలేదు. అనంతరం దీన్ని చూసిన గౌతమమహర్షి వారిని బల్లులుగా మారిపొమ్మని శపించాడు. శాపవిముక్తి కోసం వారు ప్రార్థించగా కాంచీపురంలోని వరదరాజపెరుమాళ్ ఆలయంలో లభిస్తుందని చెప్పాడు. దీంతో వారు పెరుమాళ్ ఆలయంలోనే బల్లుల రూపంలో ఉండి స్వామివారిని ప్రార్థించారు.

కొన్నాళ్లకు వారికి శాప విముక్తి కలిగి మోక్షం లభించింది. ఈ సమయంలో సూర్య, చంద్రులు సాక్ష్యంగా ఉన్నారని, శాపవిమోచనం అనంతరం శిష్యులిద్దరి శరీరాలు బంగారు, వెండి బల్లుల రూపంలో బొమ్మలుగా ఉండి భక్తులకు దోషనివారణ చేస్తాయని సూర్య, చంద్రులు చెప్పారు. బంగారు అంటే సూర్యుడు, వెండి అంటే చంద్రుడు అని కూడా అర్థం. అయితే దీనితో పాటుగానే.. సరస్వతీ దేవీ నుంచి శాపవిముక్తి పొందిన ఇంద్రుడు పెరుమాళ్ ఆలయంలో దీనికి గుర్తుగా ఈ బల్లి బొమ్మలను ప్రతిష్టించినట్టు మరో కథనం కూడా ఉంది.

అయితే, ఇటువంటి సూర్యుని తేజస్సుతో ఉండే బంగారు బల్లులు ఒకప్పుడు నిజంగానే ఉండేవి. ఈమధ్య ఇవి అంతరించిపోయాయని , ఎక్కడా కనిపించడంలేదని ఆవేదన చెందుతున్న శాస్త్రవేత్తలకు శేషాచలం కొండల్లో ఇవి చమక్కున మెరిసి కొత్త ఆశలు రేకెత్తించాయి. శేషాచలం ఏడుకొండల్లో ఇవి కనిపించాయి. రాతి గుహలే వీటి ఆవాసం. బంగారు బల్లి శాస్త్రీయ నామం కాలొడాక్టిలోడ్స్ అరీస్. ఇది రాత్రుల్లో సంచరించే నిశాచర జీవి. బంగారు వర్ణం పోలిన ముదురు పసుపు, లేత పసుపు రంగులో మెరిసినట్టు ఉంటుంది.

ఇవి 150 నుంచి 180 మిల్లీ మీటర్ల వరకు పొడవు పెరుగుతాయి. రాతి గుహలు వాటి నివాసానికి అనుకూలం. సూర్యరశ్మి పడని, వేడి తగలని ప్రదేశాల్లో కనిపిస్తాయి. సాధారణంగా చీకటి పడ్డాక గుహల సందుల నుంచి వెలికి వస్తాయి. అనుకూల వాతావరణంలో జనం చడీచప్పుడు లేనప్పుడు ఒక్కోసారి పగటి పూట కూడా బయటకు వస్తాయి. ఇవి 40 నుంచి 50 గుడ్లు పెడతాయి. సాధారణ బల్లుల కంటే గట్టిగా, వింతగా అరుస్తాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

అయితే ..ఇంట్లో బల్లి తిరుగుతున్నప్పుడు అది మీద పడితే ఎట్లా ? అనే అపోహ అందరికీ ఉంటుంది. అలా పడినపుడు వెంటనే కామాక్షి ఆలయంలోని బల్లిని తలుచుకొని స్నానం చేసి, ఇష్టదైవాణ్ణి ఆరాదిస్తే దోషం పోతుందంటారు. ఏమోఇంకా దోషం ఉందేమో అనుకునేవారు కంచి అమ్మవారిని దర్శించుకొని బల్లులను తాకుతారు.

కివీస్ ప్రతీకారం..

- టీమిండియాకు భారీ పరాభవం!
- నాలుగో టీట్వంటీలో 87 పరుగుల తేడాతో న్యూజిలాండ్ ఘన విజయం
- సెంచరీతో విరుచుకుపడిన గ్లెన్ ఫిలిప్స్ (107), బ్రాస్‌వెల్ (65) హాఫ్ సెంచరీ
- 259 పరుగుల భారీ స్కోరు సాధించిన కివీస్
- 172 పరుగులకే కుప్పకూలిన భారత బ్యాటింగ్ లైనప్
- కివీస్ పేసర్ జాకబ్ డఫ్ఫీకి నాలుగు వికెట్లు

ఆక్లాండ్, అక్టోబర్ 30 : భారత్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో వరుసగా మూడు మ్యాచ్‌లు ఓడిపోయి డీలాపడిన న్యూజిలాండ్ ఎట్టకేలకు సత్తా చాటింది. ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ వేదికగా శుక్రవారం జరిగిన నాలుగో మ్యాచ్‌లో కివీస్ జట్టు 87 పరుగుల భారీ తేడాతో టీమిండియాను చిత్తు చేసి సిరీస్‌లో తొలి విజయాన్ని నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత ఇరవై ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 259 పరుగుల భారీ స్కోరు సాధించింది. కివీస్ బ్యాటర్లలో గ్లెన్ ఫిలిప్స్ (49 బంతుల్లో 107; ఆరు ఫోర్లు, పది సిక్సర్లు) సుడిగాలి సెంచరీతో చెలరేగగా.. చివర్లో మైకెల్ బ్రాస్‌వెల్ (25 బంతుల్లో 65; నాలుగు ఫోర్లు, ఆరు సిక్సర్లు) విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. అనంతరం 260 పరుగుల అసాధ్యమైన లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు.. కివీస్ బౌలర్ల ధాటికి ఇరవై ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 172 పరుగులకే పరిమితమై ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. అయితే, ఈ సిరీస్‌లో తొలి మూడు మ్యాచ్‌లు గెలిచిన భారత జట్టు ఇప్పటికే సిరీస్‌ను కైవసం చేసుకున్న విషయం తెలిసిందే.

ఫిలిప్స్ సుడిగాలి సెంచరీ..

టాస్ గెలిచిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ముందుగా బౌలింగ్ ఎంచుకోగా.. కివీస్ బ్యాటర్లు ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగారు. ఓపెనర్లు టిమ్ సైఫెర్ట్ (3) విఫలమైనా.. డారిల్ మిచెల్ (24), ఫిన్ అలెన్ (31) ధాటిగా ఆడారు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన గ్లెన్ ఫిలిప్స్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. భారత బౌలర్లను ఊచకోత కోస్తూ మైదానం నలుమూలలా సిక్సర్లు, బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 49 బంతుల్లోనే పది భారీ సిక్సర్లు, ఆరు ఫోర్లతో 107 పరుగులు చేసి కెరీర్‌లో మూడో టీట్వంటీ సెంచరీ నమోదు చేశాడు. అతడికి తోడుగా మైకెల్ బ్రాస్‌వెల్ కూడా రెచ్చిపోవడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. బ్రాస్‌వెల్ కేవలం 25 బంతుల్లోనే ఆరు సిక్సర్లు, నాలుగు ఫోర్లతో 65 పరుగులు చేసి ఔటయ్యాడు. భారత బౌలర్లలో మయాంక్ యాదవ్ మూడు వికెట్లు తీసినప్పటికీ 48 పరుగులు సమర్పించుకున్నాడు. నితీశ్ కుమార్ రెడ్డి (1/64), ప్రిన్స్ యాదవ్ (1/49), అర్ష్‌దీప్ సింగ్ (1/38), అక్షర్ పటేల్ (1/43) ధారాళంగా పరుగులు ఇచ్చుకున్నారు.

తడబడిన టీమిండియా.. డఫ్ఫీ మ్యాజిక్..

260 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భారత జట్టుకు ఏమాత్రం శుభారంభం దక్కలేదు. కివీస్ పేసర్ జాకబ్ డఫ్ఫీ తొలి ఓవర్‌లోనే ఓపెనర్లు సంజు శాంసన్ (4), ఇషాన్ కిషన్ (0)లను పెవిలియన్‌కు పంపి కోలుకోలేని దెబ్బతీశాడు. ఈ షాక్ నుంచి టీమిండియా చివరి వరకు కోలుకోలేకపోయింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (22), అభిషేక్ శర్మ (27), నితీశ్ కుమార్ రెడ్డి (21), నమన్ ధీర్ (28) కాసేపు క్రీజులో నిలబడినా.. భారీ షాట్లకు యత్నించి వికెట్లు పారేసుకున్నారు. మిడిలార్డర్‌లో తిలక్ వర్మ (35 బంతుల్లో 35; ఒక ఫోర్, మూడు సిక్సర్లు) కొంతసేపు ఒంటరి పోరాటం చేసినా అది జట్టును ఓటమి నుంచి రక్షించలేకపోయింది. అక్షర్ పటేల్ (7) నిరాశపరిచాడు. చివర్లో ప్రిన్స్ యాదవ్ (18 నాటౌట్) ఫర్వాలేదనిపించాడు. మొత్తంగా భారత బ్యాటర్లు ఎవరూ కనీసం హాఫ్ సెంచరీ కూడా సాధించలేకపోయారు. న్యూజిలాండ్ బౌలర్లలో జాకబ్ డఫ్ఫీ కేవలం 23 పరుగులిచ్చి నాలుగు కీలక వికెట్లు పడగొట్టి భారత పతనాన్ని శాసించాడు. మాథ్యూ ఫిషర్ 2, మిచెల్ సాంట్నర్ 2 వికెట్లు తీసి విజయంలో కీలక పాత్ర పోషించారు.

చరిత్ర సృష్టించిన మనీషా

వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకం

- ఫైనల్లో అమెరికా రెజ్లర్‌పై అద్భుత విజయం
- పసిడి గెలిచిన తొలి భారత మహిళా రెజ్లర్‌గా సరికొత్త రికార్డు
- సుశీల్ కుమార్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో రెజ్లర్
- ఈ టోర్నీలో భారత్‌కు మొత్తం నాలుగు పతకాలు

ఆస్తానా, అక్టోబర్ 30 : కజకిస్థాన్ రాజధాని ఆస్తానా వేదికగా జరుగుతున్న వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళా రెజ్లర్ మనీషా భన్వాలా చరిత్ర సృష్టించింది. ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో బంగారు పతకం సాధించి అరుదైన ఘనతను తన పేరిట లిఖించుకుంది. శుక్రవారం జరిగిన 59 కిలోల విభాగం ఫైనల్ మ్యాచ్‌లో అమెరికాకు చెందిన అబిగైల్ నెట్టెను ఓడించి వరల్డ్ చాంపియన్‌గా అవతరించింది. దీంతో వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్ చరిత్రలో స్వర్ణం సాధించిన తొలి భారతీయ మహిళా రెజ్లర్‌గా మనీషా సరికొత్త రికార్డు నెలకొల్పింది.

వెనుకబడినా.. అదరగొట్టింది..

ఫైనల్ పోరు ఆరంభంలో అమెరికా రెజ్లర్ అబిగైల్ దే పూర్తి ఆధిపత్యం కొనసాగింది. ఒకానొక దశలో మనీషా 0-6 పాయింట్ల తేడాతో తీవ్రంగా వెనుకబడింది. ఆ క్లిష్ట పరిస్థితుల్లో మనీషా అద్భుతంగా పుంజుకుంది. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా వరుసగా పాయింట్లు సాధిస్తూ కళ్లెం వేసింది. ఏకంగా ఎనిమిది పాయింట్లు స్కోరు చేసి చివరికి 8-6 తేడాతో సంచలన విజయాన్ని సొంతం చేసుకుంది. కళ్లు చెదిరే ప్రదర్శనతో విజయం సాధించడంతో భారత కుస్తీ అభిమానుల సంబరాలు అంబరాన్నంటాయి.

రెండో భారత రెజ్లర్‌గా..

వరల్డ్ టైటిల్ గెలిచిన రెండో భారత రెజ్లర్‌గా మనీషా చరిత్రకెక్కింది. గతంలో 2010లో జరిగిన చాంపియన్‌షిప్‌లో దిగ్గజ రెజ్లర్ సుశీల్ కుమార్ 66 కేజీల ఫ్రీస్టైల్ కేటగిరీలో బంగారు పతకం సాధించాడు. ఆ తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు మనీషా ఆ ఫీట్ సాధించింది. ఇక, ఈ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో మనీషా గెలిచిన పసిడితో భారత్ పతకాల సంఖ్య నాలుగుకు చేరింది. కాజల్, నీలమ్ రజత పతకాలు సాధించగా.. తనూ శర్మ కాంస్యం గెలుపొందింది.

జపాన్ చిత్తు.. భారత్ హ్యాట్రిక్ విక్టరీ!

- ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలో జపాన్‌పై 4-1 తేడాతో ఘనవిజయం
- 150వ మ్యాచ్‌లో రెండు గోల్స్‌తో అదరగొట్టిన అభిషేక్ నైన్
- చివరి 15 నిమిషాల్లో మూడు గోల్స్‌తో చెలరేగిన టీమిండియా
- హర్మన్‌ప్రీత్, విష్ణుకాంత్ సింగ్ సూపర్ గోల్స్
- టోర్నీలో వరుసగా మూడో విజయంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానం

జలంధర్, అక్టోబర్ 30 : ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ-2026లో భారత పురుషుల హాకీ జట్టు జైత్రయాత్ర కొనసాగుతోంది. పంజాబ్‌లోని జలంధర్ వేదికగా శుక్రవారం జరిగిన ప్రాథమిక రౌండ్ మూడో మ్యాచ్‌లో భారత్ 4-1 గోల్స్ తేడాతో పటిష్టమైన జపాన్‌ను చిత్తు చేసి అద్భుత విజయాన్ని అందుకుంది. ఈ విజయంతో టోర్నీలో వరుసగా ముచ్చటగా మూడో గెలుపును సొంతం చేసుకున్న టీమిండియా పాయింట్ల పట్టికలో మళ్లీ అగ్రస్థానానికి దూసుకెళ్లింది. మరోవైపు ఈ టోర్నీలో జపాన్‌కు ఇదే తొలి పరాజయం కావడం గమనార్హం.

చివరి క్షణాల్లో జపాన్ షాక్..

ఒలింపియన్ సుర్జిత్ సింగ్ హాకీ స్టేడియంలో జరిగిన ఈ పోరు ఆరంభం నుంచే ఉత్కంఠగా సాగింది. ఆట 11వ నిమిషంలో సుఖ్‌జీత్ సింగ్ అందించిన అద్భుతమైన పాస్‌ను అభిషేక్ నైన్ గోల్‌గా మలిచి భారత్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. అయితే, మొదటి క్వార్టర్ ముగిసే చివరి క్షణాల్లో జపాన్‌కు పెనాల్టీ స్ట్రోక్ లభించింది. దీనిని జపాన్ ఆటగాడు షోటా కగావా ఎంతో చాకచక్యంగా గోల్‌గా మలచడంతో స్కోరు 1-1తో సమం అయింది. ఆ తర్వాత రెండో, మూడో క్వార్టర్లలో ఇరు జట్లు హోరాహోరీగా తలపడినా గోల్స్ నమోదు కాలేదు. జపాన్ డిఫెండర్లు అడ్డుగోడలా నిలబడి భారత దాడులను సమర్థవంతంగా అడ్డుకోవడంతో మ్యాచ్ ఎటువైపు మొగ్గుతుందోనన్న టెన్షన్ నెలకొంది.

చివరి 15 నిమిషాల్లో సునామీ..

చివరిదైన నాలుగో క్వార్టర్‌లో (ఆఖరి 15 నిమిషాల్లో) భారత ఆటగాళ్లు ఒక్కసారిగా చెలరేగిపోయారు. ఏకంగా మూడు గోల్స్ వర్షం కురిపించి జపాన్‌ను కోలుకోలేని దెబ్బతీశారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ తనకు లభించిన పెనాల్టీ కార్నర్‌ను పవర్‌ఫుల్ డ్రాగ్ ఫ్లిక్‌తో గోల్‌గా మలిచి భారత్‌కు 2-1 ఆధిక్యాన్ని అందించాడు. ఈ టోర్నీలో హర్మన్‌ప్రీత్‌కు ఇది ఐదో గోల్ కావడం విశేషం. ఆ వెంటనే తన 150వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతున్న అభిషేక్ నైన్ అద్భుతమైన ఫీల్డ్ గోల్ చేసి స్కోరును 3-1కు పెంచాడు. ఇక, చివర్లో విష్ణుకాంత్ సింగ్ కూడా అద్భుతమైన సోలో గోల్‌తో మెరిసి భారత్ విజయాన్ని 4-1తో ఖాయం చేశాడు. అద్భుత ఫామ్‌లో ఉన్న భారత జట్టు శనివారం జరగనున్న తన తదుపరి మ్యాచ్‌లో మలేషియాతో తలపడనుంది.

సెమీస్‌లో సింధు వర్సెస్ అన్మోల్!

క్వార్టర్స్‌లో డెన్మార్క్ క్రీడాకారిణిపై సింధు ఘనవిజయం

సార్‌బ్రూకెన్ (జర్మనీ), అక్టోబర్ 30 : జర్మనీ వేదికగా జరుగుతున్న ప్రతిష్టాత్మక హైలో ఓపెన్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్లు అదరగొడుతున్నారు. మహిళల, పురుషుల సింగిల్స్ విభాగాల్లో సత్తా చాటుతూ ముందంజ వేశారు. ముఖ్యంగా మహిళల సింగిల్స్ సెమీస్‌లో భారత క్రీడాకారిణులు ఇద్దరు ముఖాముఖి తలపడనుండటం విశేషం. స్టార్ షట్లర్, రెండు సార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు, యువ సంచలనం అన్మోల్ ఖర్బ్ ఇద్దరూ సెమీస్‌కు దూసుకెళ్లి ఒకరికొకరు ఢీకొట్టేందుకు సిద్ధమయ్యారు. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్‌లో పీవీ సింధు 21-12, 21-10 తేడాతో డెన్మార్క్‌కు చెందిన అమాలీ షుల్జ్‌పై అలవోక విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మొదటి నుంచీ స్పష్టమైన ఆధిపత్యం ప్రదర్శించిన సింధు.. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. కేవలం 28 నిమిషాల్లోనే రెండు గేములను గెలుచుకుని సెమీస్ బెర్త్ ఖరారు చేసుకుంది. మరో క్వార్టర్ ఫైనల్‌లో భారత యువ క్రీడాకారిణులు అన్మోల్ ఖర్బ్, ఉన్నతి హుడా తలపడ్డారు. గంటా ఎనిమిది నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ పోరులో అన్మోల్ ఖర్బ్ 21-17, 18-21, 21-16 తేడాతో ఉన్నతిపై విజయం సాధించి సెమీస్‌లో అడుగుపెట్టింది. దీంతో ఫైనల్ బెర్త్ కోసం పీవీ సింధు, అన్మోల్ ఖర్బ్ సెమీస్‌లో తలపడనున్నారు. ఈ మ్యాచ్‌లో ఎవరు గెలిచినా ఫైనల్‌లో భారత ప్రాతినిధ్యం ఖాయమైంది

లక్ష్యసేన్ అద్భుత కమ్‌బ్యాక్..

మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్ ఆటగాడు లక్ష్యసేన్ కూడా సెమీస్‌కు ముందంజ వేశాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ పోరులో ఫిన్లాండ్ ఆటగాడు కల్లె కోల్జోనెన్‌పై 14-21, 21-17, 21-13 తేడాతో అద్భుత విజయం సాధించాడు. తొలి గేమ్‌ను కోల్పోయి మ్యాచ్‌లో వెనుకబడిన లక్ష్యసేన్.. ఆ తర్వాత అసాధారణంగా పుంజుకుని అద్భుతమైన కమ్‌బ్యాక్ ఇచ్చాడు. ఆధిపత్యం ప్రదర్శిస్తూ మిగతా రెండు గేములను కైవసం చేసుకుని సెమీస్‌లో అడుగుపెట్టాడు. పురుషుల సింగిల్స్ సెమీ ఫైనల్‌లో లక్ష్యసేన్ ఫ్రాన్స్‌కు చెందిన థోమా జూనియర్ పోపోవ్‌తో తలపడనున్నాడు.

ముంబై ఇండియన్స్ ఫీల్డింగ్ కోచ్‌గా తెలుగోడు!

టీమిండియా మాజీ ఫీల్డింగ్ కోచ్ టి.దిలీప్‌కు ఎంఐ బాధ్యతలు

ముంబై, అక్టోబర్ 30 :

వచ్చే ఐపీఎల్ సీజన్ కోసం ముంబై ఇండియన్స్ (ఎంఐ) ఫ్రాంచైజీ సన్నాహాలు ముమ్మరం చేసింది. జట్టు కోచింగ్ స్టాఫ్‌ను పూర్తిగా ప్రక్షాళన చేసింది. ఇప్పటికే హెడ్ కోచ్‌గా మాజీ ఆల్‌రౌండర్ కీరన్ పొలార్డ్‌ను నియమించిన ముంబై.. శుక్రవారం కొత్త కోచింగ్ బృందాన్ని ప్రకటించింది. ఇందులో ఫీల్డింగ్ కోచ్‌గా హైదరాబాద్‌కు చెందిన తెలుగు వ్యక్తి టి.దిలీప్ ఎంపిక కావడం విశేషం.

టీమిండియా విజయాల్లో కీలక పాత్ర..

దిలీప్ దాదాపు ఐదేళ్ల పాటు భారత జాతీయ జట్టుకు ఫీల్డింగ్ కోచ్‌గా వ్యవహరించారు. భారత్ సాధించిన 2024, 2026 టీ20 వరల్డ్ కప్‌లతో పాటు, 2025 చాంపియన్స్ ట్రోఫీ విజయాల్లో ఆయనది కీలక పాత్ర. భారత ఆటగాళ్లు ఫీల్డింగ్‌లో మెరుగవ్వడంలో దిలీప్ కృషి ఎంతో ఉంది. ఈ ట్రాక్ రికార్డును దృష్టిలో ఉంచుకునే ముంబై ఫ్రాంచైజీ ఆయనను తమ బృందంలోకి తీసుకున్నట్లు స్పష్టమవుతోంది.

మాజీలకు పెద్దపీట..

బ్యాటింగ్ కోచ్‌గా భారత మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్పను ముంబై ఎంపిక చేసింది. బౌలింగ్ కోచ్‌లుగా న్యూజిలాండ్ మాజీ పేసర్ మిచెల్ మెక్‌క్లెనాఘన్, భారత మాజీ బౌలర్ ధవళ్ కులకర్ణిలను నియమించింది. వీరిలో దిలీప్ మినహా ఊతప్ప, మెక్‌క్లెనాఘన్, ధవళ్ కులకర్ణి గతంలో ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరఫున ఆడిన వారే కావడం గమనార్హం. కాగా, గత కొన్ని సీజన్లుగా ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్న ముంబై జట్టు తలరాతను.. ఈ కొత్త కోచింగ్ స్టాఫ్ ఎంతవరకు మారుస్తుందో చూడాలి.

లావణీ కళాకారిణిగా శ్రద్ధా కపూర్!

వితాబాయి బయోపిక్ 'ఈతా' ట్రైలర్ విడుదల

ముంబై, అక్టోబర్ 30 : బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ఈతా' సినిమా ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ లావణీ కళాకారిణి వితాబాయి నారాయణ్‌గావ్‌కర్ జీవితం ఆధారంగా ఈ బయోపిక్ తెరకెక్కుతోంది. వితాబాయి పాత్రలో శ్రద్ధా కపూర్ ఒదిగిపోయినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. ఒక సాధారణ కళాకారిణి ప్రయాణంలో ఎదుర్కొన్న సవాళ్లను ఇందులో కళ్లకు కట్టారు. ఈ పాత్ర శ్రద్ధా కెరీర్‌లోనే మైలురాయిగా నిలుస్తుందని అంచనా వేస్తున్నారు. 'ఛావా' చిత్ర దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ ఈ బయోపిక్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. మాడాక్ ఫిలింస్ బ్యానర్‌పై దినేష్ విజాన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. విలక్షణ నటుడు రణ్‌దీప్ హూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, డిసెంబర్ 4న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఎల్లమ్మ' కోసం 100 మంది కళాకారులు!

టైటిల్ సాంగ్ రికార్డింగ్ పూర్తి చేసిన డీఎస్పీ

విభిన్న సంస్కృతులకు చెందిన జానపద వాయిద్యకారులతో ప్రయోగం

హైదరాబాద్, అక్టోబర్ 30 : 'బలగం' ఫేమ్ వేణు యెల్దండి దర్శకత్వంలో స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ దేవి శ్రీ ప్రసాద్ (డీఎస్పీ) హీరోగా పరిచయం అవుతున్న సినిమా 'ఎల్లమ్మ'. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. దేశంలోని నలుమూలల నుంచి వచ్చిన 100 మంది జానపద వాయిద్య కళాకారులతో కలిసి టైటిల్ సాంగ్ రికార్డింగ్ పూర్తి చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా చేసిన ఈ ప్రయోగం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుందని తెలిపారు. త్వరలోనే సినిమా మొదటి సింగిల్‌ను విడుదల చేస్తామని ప్రకటించారు. ఈ సినిమాలో దేవి శ్రీ ప్రసాద్ 'పర్షి' అనే పాత్రలో నటిస్తూ, తానే సొంతంగా సంగీతం సమకూర్చుకుంటున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తుండగా.. హన్షిత రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని థియేటర్లలోకి తీసుకురానున్నారు. 'బలగం' తర్వాత వేణు నుంచి వస్తున్న సినిమా కావడంతో ప్రేక్షకులు దీనిపై భారీ అంచనాలు పెట్టుకున్నారు.

కీర్తి సురేశ్‌కు చేదు అనుభవం!

హైదరాబాద్, అక్టోబర్ 30 :

ప్రముఖ నటి కీర్తి సురేశ్‌కు విమాన ప్రయాణంలో ఓ చేదు అనుభవం ఎదురైంది. ఇటలీలోని మిలాన్ నుంచి భర్త ఆంటోనీ తట్టిల్‌తో కలిసి ఆమె భారత్‌కు వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఉన్న ఓ ప్రయాణికుడు సెల్ఫీ కోసం ఆమెను తీవ్రంగా ఇబ్బంది పెట్టాడు. అతడు కనీసం నిలబడే స్థితిలో లేకపోవడంతో కాసేపు ఆగాలని కీర్తి కోరినా వినకుండా.. వెంటనే ఫొటో దిగాల్సిందేనంటూ పట్టుబట్టాడు. ఆ ప్రయాణికుడి ప్రవర్తన మితిమీరడంతో, సాధారణంగా ఎంతో ప్రశాంతంగా ఉండే తన భర్త ఆంటోనీ సైతం గట్టిగా వార్నింగ్ ఇవ్వాల్సి వచ్చిందని కీర్తి ఓ తాజా ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. చివరకు విమాన సిబ్బంది జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారని వివరించారు. అభిమానులతో మాట్లాడటం, వారి ప్రేమను స్వీకరించడం తనకు ఎంతో ఇష్టమేనని, అయితే అభిమానం పేరుతో వ్యక్తిగత హద్దులు దాటడం, స్వేచ్ఛకు భంగం కలిగించడం ఏమాత్రం సరికాదని కీర్తి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

మోహన్‌లాల్ కొత్త సినిమా షురూ!

కొచ్చిలో పూజా కార్యక్రమాలు..

ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్

కొచ్చి, అక్టోబర్ 30 : మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ హీరోగా, దర్శకుడు అనూప్ సత్యన్ తెరకెక్కిస్తున్న కొత్త సినిమా కొచ్చిలో అట్టహాసంగా ప్రారంభమైంది. తాత్కాలికంగా చూ368 వర్కింగ్ టైటిల్‌తో పిలుస్తున్న ఈ సినిమా పూజా కార్యక్రమాల్లో సినీ ప్రముఖులతో పాటు చిత్ర బృందం పాల్గొంది. నిర్మాత బిను జార్జ్ అలెగ్జాండర్ తల్లి జ్యోతి ప్రజ్వలన చేయగా.. తొలి షాట్‌కు మోహన్‌లాల్ స్వయంగా క్లాప్ కొట్టారు. 'వరణే అవశ్యముంద్' తర్వాత అనూప్ సత్యన్ దర్శకత్వం వహిస్తున్న రెండో సినిమా ఇది. పూర్తిస్థాయి యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో నటుడు ముకేశ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. ఇద్దరు చిన్న పిల్లలతో కలిసి మోహన్‌లాల్ నవ్వుతూ కూర్చున్నట్లుగా పోస్టర్‌ను డిజైన్ చేశారు.

అనూప్ తండ్రి, ప్రముఖ దర్శకుడు సత్యన్ అంతికాడ్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని మోహన్‌లాల్ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. సత్యన్ మొదటి సినిమా నుంచి తాజా చిత్రం వరకు కలిసే పనిచేశామని, ఇప్పుడు ఆయన కొడుకుతో ప్రయాణం కొనసాగించడం సంతోషంగా ఉందన్నారు. షెహనాద్ జలాల్ సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతం సమకూరుస్తున్నారు. స్టంట్ శివ యాక్షన్ కొరియోగ్రఫీ అందిస్తున్నారు.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com